





అవగాహన పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ ఆనంద్ (ఫైల్)

ఆమెకు అండగా..!

నేటి సమాజంలో భార్యాభర్తలిద్దరూ పనిచేస్తే కాని ఇల్లు గడవని పరిస్థితి. దీంతో దాదాపుగా ప్రతి ఇంటి నుంచి ఓ మహిళ ఉద్యోగానికి వెళుతోంది. ఈ పరిస్థితుల్లో ఆమెకు రక్షణ కూడా కీలకమే. పనిచేసే చోట పలువురు మహిళలు వేధింపులకు గురవుతున్నారు. ఆ విషయాన్ని ఎవరికి చెప్పుకున్నా పరిష్కారం కాకపోవటంతో వారు మానసికంగా కుంగిపోతున్నారు. తమ మాట వినడం లేదని వేధింపులకు గురిచేసే వారు అంటున్నారు. అంతేకాక అకారణంగా స్త్రీలను ఒత్తిడికి గురిచేసి కక్షసాధింపులకు దిగుతున్నారు. ఇలా ఒత్తిడికి గురవుతున్న బాధితులు ఇటు ఉద్యోగం మానలేక, అటు ఉద్యోగం చేయలేక నరకయాతన అనుభవిస్తున్నారు.

- మహిళా ఉద్యోగుల రక్షణకు ప్రభుత్వం పెద్దపీట
- ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో అంతర్గత కమిటీలు
- జిల్లాలో 150కిగాను 16 కమిటీల ఏర్పాటు

నెల్లూరు(హరనాథపురం); ఆగస్టు 6: పనిచేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించేందుకు 2013లో కేంద్ర ప్రభుత్వం మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని తెచ్చింది. ఈ చట్టం పూర్తి స్థాయిలో అమలు జరటం లేదని రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గుర్తించింది. ఈ క్రమంలో మహిళల రక్షణకు పెద్దపీట వేసింది. ఉద్యోగాల్లో ఉన్న మహిళలకు మరింత భరోసా ఇవ్వాలని కూడా నిర్ణయించింది. దీంతో ఇకపై పనిచేసే చోట మహిళలకు వేధింపులు ఉండవు. ధైర్యంగా విధులు నిర్వహించుకోవచ్చు. స్వేచ్ఛాయుత వాతావరణంలో వారు ఉద్యోగం చేసుకొనేలా, వారికి రక్షణ కల్పించేందుకు అంతర్గత కమిటీల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో మహిళా రక్షణ కమిటీలను ఏర్పాటు చేసే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది.

● ఒక్క మహిళ ఉన్నా...

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, క్రీడా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వైద్యశాలలు, సహకార సంస్థలు, విద్యా సంస్థలు, బ్యాంకులు, కార్పొరేషన్‌లు, స్వయం ఉపాధి సంస్థల్లో పదిమంది పనిచేసే చోట ఒక మహిళ ఉన్నా విధిగా కమిటీ ఏర్పాటు చేయాల్సిందే. పది మంది కంటే ఉద్యోగులు తక్కువగా పనిచేసేచోట మహిళలకు సమస్య వస్తే జిల్లా కమిటీలను ఆశ్రయించవచ్చు. పదిమంది ఉద్యోగులు ఉన్న చోట ఐదుగురితో కమిటీ వేస్తారు. ఇందులో 50 శాతం మంది మహిళలే సభ్యులుగా ఉంటారు. ఈ లెక్కన ఇద్దరి నుంచి ముగ్గురి వరకు మహిళలు విధిగా ఈ కమిటీల్లో ఉంటారు అంతర్గత కమిటీ సభ్యుల పేర్లు, కార్యవర్గం వివరాలు అందరికీ కనిపించేలా నోటీసు బోర్డులో ఉంచాలి. ఎవరైనా లైంగికంగా, మానసికంగా వేధిస్తే వెంటనే అంతర్గత కమిటీకి ఫిర్యాదు చేయవచ్చు. అక్కడే ఏర్పాటు చేసిన బాక్సులో ఫిర్యాదు కాపీని వేయవచ్చు. ఈ విషయమై అంతర్గత కమిటీలో చర్చిస్తారు. అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే జిల్లా కమిటీని ఆశ్రయించవచ్చు. అక్కడ నేరం రుజువైతే మాత్రం శాఖాపరమైన చర్యలు తీసుకుంటారు. జిల్లా కమిటీలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మహిళా శిశు సంరక్షణాధికారి సభ్యులుగా ఉంటారు. ఒకవేళ మహిళ ఎవరైనా ఉద్దేశపూరకంగా తప్పుడు కేసు పెడితే ఆమెపై కూడా చర్యలు ఉంటాయి.



హేనా సుజన్

150 కమిటీల ఏర్పాటుకు నిర్ణయం

జిల్లాలో 150 మహిళా రక్షణ కమిటీలను ఏర్పాటు చేయడానికి నిర్ణయించాం. ఇప్పటి వరకు 16 కమిటీలను మాత్రమే ఏర్పాటు చేశాం. మండల స్థాయిలో తహసీల్దార్, కార్పొరేషన్ స్థాయిలో కమిషనర్ కమిటీలకు నోడల్ అధికారులుగా ఉంటారు. ఫిర్యాదు అందిన వెంటనే 509 సెక్షన్ కింద చర్యలు ఉంటాయి.

\- హేనా సుజన్, ఐసీడీఎస్, పీడీ

● ప్రతి కార్యాలయంలో కమిటీ

పని చేసే ప్రదేశంలో మహిళలపై లైంగికంగా జరిగే దాడుల నిరోధానికి ప్రతి కార్యాలయంలో కమిటీ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. ఈ కమిటీలో సీనియర్ మహిళా ఉద్యోగితోపాటు ఎన్‌జీవో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై మహిళా ఉద్యోగులందరికీ అవగాహన కల్పించాలన్నారు. ఈ మేరకు రూపొందించిన పోస్టర్‌ను ఇటీవల కలెక్టర్ విడుదల చేశారు.



- విధుల్లో ఇంకా కొంతమంది అధికారుల తీవ్ర నిర్లక్ష్యం
- పత్రికల్లో కథనాలకు వివరణ ఇవ్వాలంటూ కలెక్టర్ ఆదేశం
- ఖాతరు చేయని పలుశాఖల ఉన్నతాధికారులు
- ప్రభుత్వం మారినా మారని కొందరి తీరు

మేమింతే..!

నెల్లూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా ఇంకా పలువురు అధికారుల తీరు మాత్రం మారలేదు. వైసీపీ ప్రభుత్వంలోనే ఉన్నట్లుగా.. మమ్మల్ని ఎవరూ అడగరులే... అన్న ధీమాతోనే వారు వ్యవహరిస్తున్నారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఓ వైపు సీఎం చంద్రబాబు హెచ్చరిస్తుండగా, ఆ పని తీరులో మార్పు తీసుకువచ్చేందుకు కలెక్టర్ ఆదేశాలిస్తున్నా కొంత మంది మాత్రం నిర్లక్ష్యం వీడడం లేదు. వారి శాఖల్లో జరుగుతున్న పనితీరు ప్రజలకు తెలియజేయకుండా తప్పించుకు తిరుగుతున్నారు. ఇలా తెలియజేస్తే వారి బాగోతాలు బయట పడతాయని కొందరు వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం. పత్రికల్లో వచ్చే కథనాలపై స్పందించాలని కలెక్టర్ ఓ ఆనంద్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజాసమస్యలపై వెంటనే స్పందించి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో ప్రజలకు తెలియజేయాలని సూచించినా కొన్ని శాఖలు మాత్రం కలెక్టర్ ఆదేశాలను సైతం ధిక్కరిస్తున్నాయి. వివరణ ఇవ్వాలంటూ కలెక్టరేట్ నుంచి వచ్చిన లేఖలన్నీ పలు శాఖల్లో పేరుకుపోయాయి. కలెక్టర్ ఒక్కరే అన్ని శాఖలను చూస్తున్నా.. శాఖాధిపతులు మాత్రం వారి శాఖల సమస్యలను కూడా పట్టించుకోలేని దుస్థితిలో ఉన్నారు.

● పాలనలో పారదర్శకత కోసం...

పాలనలో పారదర్శకత ఉండాలని, మీడియాలో వచ్చే ప్రజా సంబంధ వార్తలపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని సాక్షాత్తూ సీఎం చంద్రబాబు నాయు డే కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సూచించారు. మీడియాలో వచ్చిన కథనాలు నిజమైతే ఆ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని, అదే సమయంలో తప్పుడు ప్రచారం చేస్తే ఖండన ఇవ్వడంతో పాటు న్యాయపరంగా చర్యలు తీసుకోవాలని కూడా ఆదేశించారు. పారదర్శక పాలనకు, అధికార యంత్రాంగంలో జవాబుదారీతనాన్ని తీసుకొచ్చేందుకు ఈ విధానం ఎంతగానో దోహదపడుతుంది. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రోజు నుంచే ఈ విధానాన్ని ఓ. ఆనంద్ అమల్లోకి తీసుకువచ్చారు. ప్రతీ రోజూ ఆయన పత్రికలను చదువుతూ, అందులోని ప్రజా సంబంధమైన అంశాలపై స్పందిస్తున్నారు. ఆ కథనాలపై వివరణ ఇవ్వాలని ఆయా శాఖలను ఆదేశిస్తున్నారు. గాడి తప్పిన అధికార వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేం దుకు, అధికారుల్లో ఆవహించిన నిర్లక్ష్యాన్ని తొలగించేందుకు కలెక్టర్ ఈ పంథాను ఎంచుకున్నారు. ఇలా చేయడం ద్వారా నిత్యం క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో అధికారులు తెలుసుకోవడంతో పాటు ప్రజా సమస్యలను గుర్తిం చేందుకు అవకాశం ఏర్పడుతుందని కలెక్టర్ భావన. కానీ కొన్ని శాఖల అధికారులు మాత్రం ఇంకా నిర్లక్ష్యం వీడడం లేదు. తమ శాఖలో ఏం జరుగు తుందో కలెక్టర్ చెప్పే వరకు కూడా వారికి తెలి యడం లేదు. పోనీ కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాకైనా కదులుతున్నారా..? అంటే అదీ లేదు. పలానా మీడియా కథనాలపై వివరణ ఇవ్వాలంటూ కలెక్టరేట్ నుంచి లేఖలు అందుతున్నా కొన్ని శాఖల్లో అవి చెత్తబుట్టల్లోకి చేరుతున్నాయి. ఆయా శాఖల ఉన్నతాధికారులు కనీసం వీటిని పట్టించుకోవడం లేదు. కలెక్టర్ ఆదేశాలను కూడా పట్టించుకోలేనంత బిజీగా సదరు శాఖల అధికారులు వ్యవహరిస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో జవాబుదారీతనం లేకుండా పోయింది. ప్రజా సమస్యల పరిష్కారం కన్నా ఎమ్మెల్యేలు, వైసీపీ నాయకుల సమస్యల పరిష్కారానికే ఎక్కువ ప్రాధాన్యం కల్పించారు. దీంతో ప్రజా సమస్యలు కుప్పలుతెప్పలుగా పేరుకు పోవడంతో పాటు అధికార యంత్రాంగం కూడా అవినీతి ఊబిలో కూరుకుపోయింది. అలాంటి పాలనను మెచ్చని ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి తీర్పునిచ్చారో స్పష్టంగా కనిపించింది. ఈ నేపథ్యంలోనే కొత్త ప్రభుత్వం పాలనలో మార్పులు తీసుకువస్తున్నా, కొందరు అధికారులు ఇంకా ఆ మార్పులకు అనుగుణంగా నడుచుకోవడంలేదు. ఈ అంశంపై కలెక్టర్ సీరియస్‌గా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

పులికల్లులో 2812 మెట్రిక్ టన్నుల వెలికితీత

అక్రమంగా క్వార్ట్జ్ తవ్వకాలు

- అనంతరం గుంతల పూడ్చివేత
- స్థానికుల ఫిర్యాదుతో మైనింగ్ అధికారుల తనిఖీ
- పంచనామా నిర్వహణ

పొదలకూరు, ఆగస్టు 6: గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు చేసిన అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. పొదలకూరు మండలంలోని వరదాపురంలో క్వార్ట్జ్ దోపిడీ, మొగళ్లూరు నుంచి తెల్లరాయి అక్రమ రవాణా ఘటనలు మరువకముందే.. తాజాగా పులికల్లు గ్రామ సర్వేనెంబరు 556లో అక్రమంగా క్వార్ట్జ్ తవ్వకాలు చేపట్టి 2,812 మెట్రిక్ టన్నుల ఖనిజాన్ని వెలికితీశారు. ప్రభుత్వం మారడంతో ఏమీ ఎరగనట్లుగా క్వార్ట్జ్ గుంతలను పూడ్చివేశారు. అయితే గ్రామస్థులు, స్థానిక ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేయడంతో జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారులయిన రాయల్టీ ఇన్‌స్పెక్టర్ దేవీసింగ్, మైన్స్ సూపర్‌వైజర్ ఎం.సుధాకర్‌రావు, మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్‌వో శారద మంగళవారం రంగంలోకి దిగారు. అక్రమంగా మైనింగ్ జరిగిన ప్రాంతాన్ని వారు తనిఖీ చేసి ఎంత పరిమాణంలో క్వార్ట్జ్‌ను తొలగించారో లెక్క కట్టారు. 2,812 మెట్రిక్ టన్నుల క్వార్ట్జ్‌ను తోడేటి కామాక్షమ్మ అనే ఆమెకి చెందిన పొలంలో శ్రీకాంత్‌రెడ్డి అనే వ్యక్తి తవ్వకాలు జరిపినట్లుగా నిర్ధారించారు. ఇందుకు పులికల్లుకి చెందిన వైసీపీ నాయకుడొకరు సహకరించినట్లు సమాచారం. ఈ మేరకు మైనింగ్ అధికారులు పంచనామా నివేదిక సిద్ధం చేశారు.

● మైనింగ్ లీజును ఆపేయాలి : ఎమ్మార్పీఎస్

పొదలకూరు పంచాయతీ పరిధిలోని తోకంచి గ్రామాన్ని ఆనుకుని ఉన్న సర్వే నెంబరు 77లో మైనింగ్ లీజును నిలుపుదల చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పాపయ్య, కామంచి వెంకయ్యలు మంగళవారం తహసీల్దారు సారంగపాణికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తోకంచి గ్రామంలో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉన్నారని, వీరిలో కొందరు పశువులను, జీవాలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. మైనింగ్ వల్ల ఆ జీవాలకు ప్రాణాపాయం ఉందన్నారు. కావున వెంటనే మైనింగ్ లీజ్‌ను రద్దు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీ. పెంచలప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



కావలి మున్సిపల్ కార్యాలయం

వైసీపీ నేతలకు ఊడిగం... మున్సిపాలిటీ నుంచి వేతనం !

- కావలి పురపాలక సంఘం ఖజానాకు భారీ గండి
- ఐదేళ్లలో రూ.ఐదు కోట్ల మేర దోపిడీ
- కూటమి ప్రభుత్వంలో అడ్డుకట్ట ?

కావలి,ఆగస్టు6: అక్రమ సంపాదన కోసం అడ్డదారులు తొక్కుతూ, వచ్చిన ఏ అవకాశాన్ని వదలకుండా జగన్ పాలనలో మున్సిపల్ ఖజానాకు వైసీపీ నేతలు గండి కొట్టారు. పీఏల దగ్గర నుంచి వాహనాల డ్రైవర్లు, ఇళ్లలో పనిచేసేవారు.. ఇలా వైసీపీ నాయకుల వద్ద పనిచేస్తున్న సుమారు 55 మందికి గత ఐదేళ్లుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా, దినసరి పారిశుధ్య కార్మికులుగా చూపించి మున్సిపాలిటీ నుంచి జీతాలు ఇప్పించారు. వీరిలో కొందరిని ఎన్నికల కోడ్ వచ్చాక, మరికొందరిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొత్తంగా అందరినీ తొలగించినట్లు అధికారులు చెబుతున్నారు.

● చివరి నిమిషంలో కూడా...

వైసీపీ ప్రభుత్వం దిగిపోయేటప్పుడు కూడా అప్పటి ఎమ్మెల్యే సిఫారసు లేఖ మేరకు 27 మందిని ఆప్కాస్‌లోకి అదనంగా చేర్చుకుందుకు అనుమతులు తెచ్చుకున్నారు. అయితే అనుమతులు వచ్చేసరికి ప్రభుత్వం మారటంతో 17 మందిని చేర్చుకోకుండానే నిలిపివేశారు. మొత్తం మీద కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు చేయకుండా జీతాలు తీసుకుంటున్న 25 మంది ఆప్కాస్ ఉద్యోగులు, 30 మంది దినసరి కార్మికులను గుర్తించి తొలగించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నెలకు రూ.21,000లు, దినసరి కూలీలకు నెలకు రూ.12,000ల వంతున మున్సిపాలిటీ అధికారులు ఈ ఐదేళ్ల జీతాలు చెల్లించారు. దీంతో నెలకు సుమారు రూ.9 లక్షలు వరకు మున్సిపల్ ఖజానా నుంచి ప్రజల సొమ్మును వైసీపీ నేతల అనుచరులకు చెల్లించారు. ఇలా ఏడాదికి సుమారు రూ. కోటి చొప్పున ఐదేళ్లలో రూ.5 కోట్ల మున్సిపల్ సొమ్మును అప్పనంగా మెక్కేశారు.

● తొలగింపుపై తర్జన భర్జన

రాష్ట్రంలో ప్రభుత్వం మారినా కావలి మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్నవారిలో ఎక్కువ మంది వైసీపీ నేతల అనుచరులే. మున్సిపాలిటీ ప్రతి కదలికను వారు వైసీపీ నాయకులకు చేరవేస్తున్నారనే ప్రచారం ఉంది. ఇంకా మున్సిపాలిటీలోని వివిధ విభాగాలలో సుమారు 260 మంది ఔట్‌సోర్సింగ్ కింద వైసీపీ నేతల అనుచరులు పనులు చేస్తున్నారు. వీరిని తొలగించి కొత్తవారికి అవకాశం కల్పించాలని కూటమి నేతలు పట్టుబడుతున్నారు. ఈ విషయం బయటకు పొక్కటంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో అనుమానం ఉన్న వారంతో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి వద్దకు, కూటమి నేతల వద్దకు క్యూకట్టారు. మీరు చెప్పినట్లుగా నడుచుకుంటూ, మీకు అనుకూలంగా ఉంటామని చెబుతుండడంతో వారి తొలగింపుపై నేతలు తర్జనభర్జన పడుతున్నారు. మున్సిపల్ కార్యాలయంలో కీలకపోస్టులో ఉన్న ఆరుగురు ఔట్‌సోర్సిం గ్ ఉద్యోగులను మాత్రం విధులకు రావద్దని చెప్పారు. వారికి జీతాలను నిలిపివేసినా వారి సేవలను ఏదోఒకవిధంగా అధికారులు వినియోగించుకుంటున్నారనే ప్రచారం ఉంది. దీంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులలో ఎంత మందిని తొలగిస్తారనే దానిపై మున్సిపల్ కార్యాలయంలో చర్చ సాగుతోంది.

పశుగణన పక్కాగా జరగాలి

● నోడల్ అధికారి శ్రీనివాసరాజు

నెల్లూరు(వ్యవసాయం): జిల్లాలో పశు గణన పక్కాగా నిర్వహించాలని విజయవాడ పశుసం వర్ధకశాఖ ప్రధాన కార్యాలయం నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాసరాజు ఆదేశించారు. పశు సంపద ద్వారా ఉత్పత్తి అయ్యే పాలు, గుడ్లు, మాంసం వంటి విలువలను లెక్కించి తద్వారా దేశ జాతీయ స్థూల ఉత్పత్తి విలువను లెక్కించడంలో పశుగణన ప్రధాన భూమిక పోషిస్తుందని తెలిపారు. నెల్లూరులోని పశుసంవర్ధకశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం 21వ అఖిల భారత పశుగణనకు సంబంధించి సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు అవసరమైన పథకాలు, సేవలను అందించేం దుకు తగిన ప్రణాళికలను రూపొందించేందుకు పశుగణన ఉపయోగపడుతుందన్నారు. పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ సెప్టెంబరు 1 నుంచి డిసెంబరు 31 వరకు పశుగణన కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి పశుపక్ష్యాదుల వివరాలను నమోదు చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 2వేల కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్, పట్టణ ప్రాంతాల్లో ప్రతి 3వేల కుటుంబాలకు ఒక ఎన్యుమ రేటర్‌ను కేటాయించినట్లు చెప్పారు. ఐదుగురు ఎన్యుమ రేటర్లకు ఒక సూపర్ వైజరు ఉంటారన్నారు. నెల్లూరు, కావలి, కందుకూరు డివిజన్లలో ఐదు రోజులు శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆ శాఖ డీడీ టీ సోమయ్య, నాగమణి, డాక్టర్ రామచంద్రారెడ్డి, మంజునాథ్‌సింగ్ పాల్గొన్నారు.

- పారిశుధ్యంలో కలుస్తున్న మానవ వ్యర్థాలు
- కొత్త వ్యాధులు పుట్టుకువచ్చే అవకాశం
- నిబంధనలు పాటించని జీజీహెచ్
- మూడేళ్ల తర్వాత వ్యర్థాలకు గదుల కేటాయింపు



చెత్తతో కలిపిన మానవ వ్యర్థాలు

నిర్వహణపై నిర్లక్ష్యం

నెల్లూరు(వైద్యం),ఆగస్టు 6: మానవ వ్యర్థాల (బయో మెడికల్ వేస్ట్) నిర్వహణపై అడగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తోంది. వైద్య సిబ్బంది బాధ్యతారాహిత్యం కారణంగా ఏర్పడిన ఈ సమస్యపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టకపోవటంతో కొత్త వ్యాధులు పుట్టుకువచ్చే అవకాశం ఉంది. ఈ పరిస్థితి ఎక్కడో కాదు. జిల్లా కేంద్రమైన నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనే నెలకొంది.

● అధికారుల చర్యలు శూన్యం

జీజీహెచ్‌లో కొంతకాలంగా బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అస్తవ్యస్తంగా తయారైంది. ఈ విషయమై ఎప్పటికప్పుడు పరిశీలించి, సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు, ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పైగా ఇక్కడ నిల్వ ఉన్న చెత్తను తొలగించాలని మున్సిపల్ అధికారులకు తెలియ చేయటంతో మున్సిపల్ వాహనం చెత్త తొలగించేందుకు ఇటీవల జీజీహెచ్‌కు చేరుకుంది. ఈ చెత్తతో పాటు బయోమెడికల్ వేస్ట్ ఉందని గ్రహించిన పారిశుధ్య సిబ్బంది, వాటిని తొలగిస్తుండగా సింహ పురి చైతన్య వేదిక, విద్యార్థి సంఘాలు అడ్డుకున్నాయి. వెంటనే మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది చెత్తను తరలించే వాహనాన్ని వెనక్కు తీసుకెళ్లడంతో చెత్తతోపాటు బయో మెడికల్ వేస్ట్ జీజీహెచ్‌లో నిలిచి పోయింది. ఈ నేపథ్యంలో సింహపురి చైతన్య వేదిక నిర్వాహకులు జీజీహెచ్‌లో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తీరుపై వారం క్రితం కలెక్టర్ ఆనంద్ దృష్టికి తీసుకెళ్లా రు. అలాగే కాలుష్య నివారణ అధికారి రాజశేఖర్‌కు కూడా వినతిపత్రం ఇచ్చారు. వెంటనే రాజశేఖర్ జీజీహెచ్‌కి వచ్చి బయో మెడికల్ వేస్ట్ నిర్వహణను సక్రమంగా పాటించాలని అధికారులను హెచ్చరించారు. దీంతో బయోమెడికల్ వేస్ట్ తీసుకువెళ్లే ఎస్ఎస్ బయో కేర్ వాహనం వచ్చి ఈ వేస్ట్‌ను తీసుకువెళ్లింది. ఇంత జరిగినా ఈ వ్యర్థాల తొలగింపుపై వైద్య సిబ్బందిలో మార్పు రాలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



వ్యర్థాల బిన్‌లు ఇలా..

● వేటిని ఎక్కడ వేయాలి..

మానవ వ్యర్థాల తొలగింపునకు ఎరుపు, పసుపు, బులుగు రంగుల్లో ఉండే పీపీసీ బిన్ వంటి కవర్లను వాడాలి. ఎరుపు డబ్బాలోని మందపాటి కవర్‌లో డిస్పోజిబుల్ సిరంజీలు, వీవీట్యూబ్స్, కెథెటర్స్, ఇతర ట్యూబ్‌లు, బ్లడ్‌బ్యాగ్స్, యూరిన్‌బ్యాగ్స్ వంటి మానవ వ్యర్థాలను వేయాలి. పసుపురంగు డబ్బా కవర్‌లో కణజాలాలు, శరీర భాగాలు, ప్లసెంటా, ఎంబాస్టర్ పిండాలు, అంగాలు, నెత్తూరు, చీము, డ్రస్సింగ్ వేస్ట్ వంటి వ్యర్థాలు వేయాలి. అలాగే బులుగు రంగు డబ్బా కవర్‌లో గాజు సీసాలు, పీపీసీ బిన్‌లోని కవర్‌లో బ్లేడ్‌లు, ఇంజక్షన్ మందు ఉండే పగిలిన వయల్స్, వెయిల్స్, రోగికి ఉప యోగించే పదునైన వస్తువులు వేయాలి. వీటి నిర్వాహణ బాధ్యతను నర్సులు చేపట్టాలి. వీటిపై పర్య వేక్షణను అధికారులు చేపట్టాలి. మానవ వ్యర్థాలతో పాటు భోజన వ్యర్థాలు, ఇతర వ్యర్థాలు వీటిలో కలపటం వల్ల కొత్తకొత్త వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. పైగా ఎస్ఎస్ బయోకేర్ ద్వారా ఈ వ్యర్థాలను తరలి స్తుండటం వల్ల ఇక్కడకు వచ్చే రోగులు, సహాయకులు తీవ్ర అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది.

● మూడేళ్ల తర్వాత గదుల కేటాయింపు

జీజీహెచ్‌లో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు ప్రత్యేకంగా నాలుగు గదులను నిర్మించారు. అయితే పారిశుధ్యం కాంట్రాక్టర్ ఇందులో పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. తాజాగా సింహపురి చైతన్య వేదిక చొరవ వల్ల బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు ఆ గదులను కేటాయించారు.ఇకనైనా మానవ వ్యర్థాల నిర్వహణపై జీజీహెచ్ సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.

ఉదయగిరిని జిల్లా చేయండి

● హోం మంత్రికి జిల్లా సాధన సమితి నాయకుల వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న జిల్లా సాధన సమితి నాయకులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 6: మెట్ట ప్రాంత మైన ఉదయగిరిని జిల్లా కేంద్రంగా చేయాలని మంగళవారం అమరావతిలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితకు ఉదయగిరి జిల్లా సాధన సమితి నాయకులు డాక్టర్ వేణుగోపాల్, అన్నంరెడ్డి ఆంజనేయులరెడ్డి, రాఘవేంద్ర వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వం తమ డిమాండ్‌ను పట్టించుకోకుండా జిల్లాల విభజనలో మా ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. దశాబ్దాలుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోక వనరుల లేమితో కొట్టుమిట్టాడుతున్న ఉదయగిరిని కేంద్రంగా ఆత్మకూరు, కనిగిరి, బద్వేల్, గిద్దలూరు నియోజకవర్గాల పరిధిలోని 21మెట్ట మండలాలను కలుపుకొని జిల్లా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉదయగిరిని జిల్లా చేస్తే కడప, ప్రకాశం, నెల్లూరు జిల్లాల వాసులకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. అలాగే మౌలిక వసతుల కల్పన, వ్యవసాయ, విద్యా, వైద్యరంగాలు బాగుపడి వలసలు నివారించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ వినతికి హోంమంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యం

● డీఈవో రామారావు



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న అధికారులు

నెల్లూరు (విద్య), ఆగస్టు 6 : విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఈవో రామారావు తెలిపారు. భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థుల్లో దేశభక్తిని నింపేలా సమరయోధుల జీవిత విశేషాలు, జాతీయ జెండా చరిత్ర తెలిపే విశేషాలతో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారని చెప్పారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఐబీ క్షేత్ర ప్రచార అధికారి నాగసాయి సూరి, జిల్లా పౌరసంబంధాల డిప్యూటీ డైరెక్టర్ కే సదారావు, డిప్యూటీ ఈవో ప్రసన్నలక్ష్మి, హెచ్‌ఎం కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో చోరీ

● 16 సవర్ల బంగారు నగలు అపహరణ



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ముత్యాలరావు

ఆత్మకూరు, ఆగస్టు 6: స్థానిక జేఆర్‌పేటలోని ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. జేఆర్‌పేట లో నివాసం ఉండే పద్మశేఖర్‌రెడ్డి, సుభాషిణి దంపతులు ప్రభుత్వ ఉపాధ్యాయులు. రెండురోజుల క్రితం అనారోగ్యంతో నెల్లూరు ఆసుపత్రికి వెళ్లారు. మంగళ వారం వారు ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు పగలగొట్టి ఉండడాన్ని గమనించారు. వెంటనే విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ముత్యాలరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితుల నుంచి వివరాలు సేకరించారు. సుమారు 16 సవర్ల బంగారం అపహరణకు గురైనట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. క్లూస్ టీమ్ రంగంలోకి దిగి వేలుముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ మద్యం దుకాణంలో రూ.2.80 లక్షల చోరీ

నెల్లూరు రూరల్, ఆగస్టు 6 : నెల్లూరు రూరల్ పరిధిలోని ఆకుతోట వద్దనున్న ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ జరిగినట్లు మంగళవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు పరిశీలించగా షాపులోని నగదు పెట్టెకు తాళం వేయలేదని గుర్తించారు. ఆ పెట్టెలో దాచిన రూ2.80 లక్షలు అపహరణకు గురైనట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. వాచ్‌మన్ కూడా ఇంటికి వెళ్లినట్లు, సీసీ కెమెరాలు పనిచేయడం లేదని సీఐ మారుతీకృష్ణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికెన్ వ్యర్థాలు తరలించే వాహనం పట్టివేత

● ఇద్దరిపై కేసు నమోదు

సంగం, ఆగస్టు 6: పొదల కూరు మండలం సూరాయపాళెంలోని చేపల గుంటలకు చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహ నాన్ని మంగళవారం సంగం పోలీ సులు మండల పరిధిలోని ముంబాయి రహదారిపై పట్టుకున్నారు. అనంతరం మత్స్యశాఖ ఆధ్వర్యంలో చికెన్ వ్యర్థాలను ఊరికి దూరంగా తీసుకెళ్లి పూడ్చేశారు. చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న అల్లూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

10 నుంచి ఆదివాసీల అఖిల భారతీయ సదస్సు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 6 : మధ్య భారత్‌లోని ఆదివాసీ తెగలపై మోదీ ప్రభుత్వం పాల్పడుతున్న దాడులకు వ్యతిరేకంగా, ఆదివాసీ హక్కుల పరిరక్షణ ఉద్యమం కోసం ఈనెల 10, 11 తేదీల్లో అఖిల భారతీయ సదస్సు జరుగుతోందని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక నాయకులు తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆ వేదిక రాష్ట్ర కో కన్వీనర్ జే బాబు, ఆల్‌ఇండియా లాయర్స్ ఫోరమ్ జనరల్ సెక్రటరీ ఎం బ్రహ్మం మాట్లాడారు. సదస్సు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని, ప్రజాస్వామ్యవాదులు పాల్గొనాలని కోరారు. దీనికి సంబంధించిన బ్రోచర్లు, పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్లంకి వెంకటేశ్వర్లు, ఓ అబ్బాయిరెడ్డి, కేశవులు, ఎన్ శీనయ్య పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత

● చవిటివాగు సర్వేను అడ్డుకున్న ఆక్రమణదారుడు ● ఫిర్యాదుదారుడిపై దౌర్జన్యం



సర్వే అధికారులను అడ్డుకుంటున్న ఆక్రమణదారుడు బాదుల్లా

సంగం, ఆగస్టు 6: తలుపూరుపాడులో చవిటి వాగు ఆక్రమణపై మంగళవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగాసర్వే చేస్తుండగా ఆక్రమణదారుడు అడ్డుకోవడంతో టీడీపీ, వైసీపీ ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. వివరాల మేరకు.. గ్రామానికి ఉత్తరం వైపు ఉన్న పొలాలకు పడమరవైపు చవిటి వాగు ఉంది. ఈ వాగు పోరంబోకు భూమిని గ్రామానికి చెందిన బాదుల్లా అనే రైతు ఆక్రమించి తన పొలాలనికి బాట వేసుకుంటున్నాడు. దీనిపై ఆ గ్రామానికి చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ హనీఫ్ ఇటీవల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో తహసీల్దారు సుభాషిణి సర్వేకు ఆదేశించింది. నాలుగు రోజుల ఆక్రమణలో ఉన్న కొంత వాగు భూమిని సర్వే చేశారు. బురదగా ఉండడంతో నిలిపివేసి మంగళవారం తిరిగి సర్వే చేపట్టారు. ఈలోపు ఆక్రమణదారుడు వాగు భూమిలో వేసి బాటకు మట్టి తోసి కట్ట వేశాడు. సర్వే చేస్తే తను వేసిన కట్ట తీసేయాల్సి వస్తుందని భావించి సర్వే అడ్డుకునే ఉద్దేశంతో సర్వే చేస్తున్న అధికారుల వెంట ఉన్న ఫిర్యాదుదారుడు హనీఫ్‌పై ఆక్రమణదారుడు బాదుల్లా, అతని కుమారుడు దౌర్జన్యం చేశాడు. దీంతో అక్కడే ఉన్న ఫిర్యాదుదారుడి బంధువులు, ఆక్రమణదారుడి బంధువులు వాదులాడుకోవడంతో ఇరువర్గాల మధ్య నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించారు. ఈ క్రమంలో హనీఫ్, ఖాదర్‌బాష అనేవారు ఇంటికి వస్తుండగా బాదుల్లా బంధువులు దారి కాచి దాడికి పాల్పడారు. ఈ విషయంపై హనీఫ్ 9మందిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	97
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	186
స్కిన్‌లెస్	206
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6589
వెండి కిలో ధర	రూ. 81,200
వెండి ఒక గ్రాము	రూ. 83.20

కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు

వైసీపీ ప్రభుత్వ హయాంలో చేనేతలు గడ్డుకాలం ఎదుర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలైన పథకాలు, రాయితీలు, ప్రోత్సాహకాలన్నింటిని రద్దు చేసి, నేతన్న నేస్తం పేరుతో రూ. 24 వేలతో జగన్ ప్రభుత్వం సరి పెట్టింది. ఫలితంగా చేతి నిండా పనిలేక, పని ఉన్నా గిట్టుబాటు ధరలేక చేనేత బతుకులు కునారిల్లాయి. ప్రస్తుతం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారి ఆశలు చిగురించాయి. ఈ ప్రభుత్వమైనా సమస్యలను పరిష్కరించి ఆదుకుంటుందని కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో నేడు(బుధవారం) జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

\- సంగం



మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడు

● గత ప్రభుత్వంలో 'నేతన్న నేస్తం'తోనే సరి

● అందని రాయితీలు, ప్రోత్సాహకాలు

● కోలుకోలేని స్థితిలో చేనేత పరిశ్రమ

● నేడు జాతీయ చేనేత దినోత్సవం

జిల్లాలో వ్యవసాయం తరువాత చేనేత పరిశ్రమపై అత్యధికులు ఆధారపడి జీవిస్తున్నారు. జిల్లాలోని సంగం, వింజమూరు, కోవూరు, పాటూరు, గుమ్మళ్లదిబ్బ, చెన్నూరు, ఆత్మ కూరు, ఏఎస్‌పేట, కావలి యడవల్లి, కొత్తపేట, నారాయణరెడ్డిపేట, బుచ్చి తదితర ప్రాంతాల్లో చేనేత కార్మికులు ఉన్నారు. అధికారికంగా 6,850 చేనేతమగ్గాలు ఉన్నాయి. అనధికారికంగా మరో రెండువేల వరకు ఉన్నాయి. వాస్తవానికి జిల్లాలో చేనేత కుటుంబాలు 25 వేల వరకు ఉన్నాయి. మరో 7వేల కుటుంబాలు చేనేత ఉప కులాలవారు ఉన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల వీరికి పూట జరగడం కష్టమై, కొంత మంది మగ్గాన్ని మూలన పడేసి ఇతర వృత్తుల్లో స్థిరపడ్డారు. గత ప్రభుత్వాలు ఇచ్చిన రాయితీ పథకాలు, సబ్సిడీలు, ప్రోత్సాహకాలను జగన్ ప్రభుత్వం నిర్దాక్షిణ్యం గా రద్దుచేసింది. ఫలితంగా చేనేత పరిశ్రమ తీవ్రసం క్షోభంలో కూరుకుపోయింది.

● ఉప కులాలు, వృత్తులకు మొండిచేయి

చేనేత రంగంపై ఆధారపడి 18 ఉప కులాలు ఉన్నాయి. అచ్చుల అతికేవారు, కండెలు చుట్టేవారు, పడుగులు పట్టేవారు. నూలు వడికేవారు ఉన్నారు. వీరితోపాటు చేనేత అనుబంధంగా పన్నెలు కట్టేవారు, మగ్గాలు తయారు చేసేవారు అచ్చులు కట్టేవారు, నూలుకు రంగులు అద్దెవారు తదితర 12 ఉపవృత్తులవారు ఉన్నారు వీరందరికీ వైసీపీ ప్రభుత్వం మొండి చేయి చూపింది. ప్రభుత్వం అందచేసే నేతన్న నేస్తం పథకానికి వీరిని అనర్హులను చేసింది. దీంతో వీరంతా వీధిన పడ్డారు.



అల్లు పడుతున్న నేత కార్మికులు

రద్దు చేసిన రాయితీలు, ప్రోత్సాహకాలు

● ఐసీఐసీఐ లాంబార్డ్ ఇన్సూరెన్స్ పథకాన్ని జగన్ ప్రభుత్వం పూర్తిగా నిలిపి వేసింది. ఈ పథకంలో చేనేత కార్మికుడు రూ. 100లు చెల్లిస్తే ఏడాదిపాటు రూ. 15,000ల ఆరోగ్య బీమా వర్తించేది. చేనేత కార్మికులు వృత్తిపరంగా రంగుల వల్ల ఊపరితిత్తులు, కీళ్ల నొప్పులు, కంటిచూపు లోపం, టీబీ వంటి వ్యాధుల పాలవుతుంటారు. ఇలాంటి సందర్భాల్లో కుటుంబంలో ఎవరికైనా అనారోగ్యం పాలైతే ఏ వైద్య శాల్లోనైనా వైద్యం చేయించుకుని బిల్లు పెట్టితే రూ. 15,000లు ఇచ్చేవారు.

● బునకర్ బీమా యోజన పథకంలో రూ. 80లకే ఇన్సూరెన్సు కల్పించేవారు. ఈ పథకంలో కుటుంబ యజమాని సహజ మరణం చెందితే రూ. 60 వేలు, ప్రమాదవశాత్తు అయితే రూ. 1.5 లక్షలు ఇచ్చేవారు. ఈ పథకాన్ని కూడ వైసీపీ రద్దు చేసింది.

● ఎన్‌హెచ్‌డీసీ (నేషనల్ హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ స్కీమ్)లో చేనేత కార్మికుడికి నూలు కొనుగోలుకు 10 శాతం రాయితీ ఇచ్చేవారు. ఈ పథకం కూడా లేదు.

● ఎన్‌సీడీసీ (నేషనల్ క్రెడిట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) పథకం భాగంగా కార్మికులకు ముద్ర యోజన రుణాల కింద రూ. 50 వేల బ్యాంకు రుణాలు ఇచ్చేవారు. దీన్ని నిలిపేశారు.

● గతంలో మగ్గం నేసే కార్మికులకు షెడ్డు కోసం రూ. 75 వేల ఇచ్చేవారు. దాన్ని పూర్తిగా నిలిపివేశారు.

● 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తుండగా, వైసీపీ ప్రభుత్వం ఆ ఊసే లేకుండా చేసింది.

... ఇలా ఎన్నో రాయితీలను, ప్రోత్సాహకాలను గత టీడీపీ పాలనలో అందించేది. జగన్ వాటినన్నింటినీ అటకెక్కించారు. ప్రస్తుతం ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో ఆ పథకాన్ని తిరిగి అమలవుతాయని చేనేతలు ఆశగా ఉన్నారు.

నేతన్న నేస్తంతో సరిపెట్టింది



గతంలో అమలులో ఉన్న చేనేత సంక్షేమ పథకాలను వైసీపీ రద్దు చేసి, కేవలం కొందరికే నేతన్న నేస్తం అమలు చేసింది. దీంతో చేనేతవృత్తిపై ఆధార పడిన కార్మికులు తీవ్రంగా నష్టపోయారు. గతంలో అమలవుతున్న చేనేత సంక్షేమ పథకాలన్నింటిని తిరిగి పునరుద్ధరించాలి.

\- అన్నె శ్రీనివాసులు, సాయినగర్, సంగం

ఆరోగ్య బీమా అమలు చేయాలి



2014- 19 మధ్యకా లంలో టీడీపీ హయాం లో అమలు అయిన ముడి నూలుపై రిబేటు, రాయితీలతోపాటు చేనేత కార్మికులకు గతంలో మాదిరి ఆరోగ్య బీమా వర్తింప చేయాలి. చేనేత కార్మికులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందచేయాలి.

\- బీ పెంచలమ్మ,చేనేత కార్మికురాలు, రాళ్లచెలిక, సంగం,

చేనేత బజార్లు ఏర్పాటు చేయాలి



రైతుబజార్లు మాదిరిగా ప్రతి నియోజకవర్గంలో చేనేత బజారు ఏర్పాటు చేయాలి. దీనివల్ల చేనేత కార్మికులు మాస్టర్ వీవర్స్‌పై ఆధార పడకుండా స్వంత పెట్టుబడితో వస్త్రాలు తయారు చేసి విక్రయించే అవకాశం ఉంటుంది. తద్వారా ఆదాయం పెరిగి జీవనోపాధి మెరుగుపడుతుంది.

\- సురేష్, నేత కార్మికుడు, కొత్తూరు, సంగం

డిజైన్లపై శిక్షణ ఇవ్వాలి



ప్రభుత్వం శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి డిమాండ్ ఉన్న డిజైన్లపై కార్మికులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి, మగ్గం ఆధునిక పనిముట్లను సరఫరా చేయాలి. అంతేకాకుండా వడ్డీ లేని రుణాలు అందచేయాలి.

\- మాగం, గిరిబాబు,చేనేత కార్మికుడు, సంగం

రైతులకు సదుపాయాలు కల్పించండి

● డీఆర్వోకి కిసాన్‌మోర్చా వినతి



డీఆర్వో లవన్నకు వినతిపత్రం అందచేస్తున్న కిసాన్ మోర్చా నాయకులు

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 6 : జిల్లాలోని రైతుల కోసం గోదాములు, ధాన్యం ఆరబోసుకునే కళ్లాలు, డ్రయ్యర్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్వో లవన్నకు వినతిపత్రం ఇచ్చారు. కర్షకులకు సబ్సిడీపై ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టలు తదితరాలను అందించాలని కోరారు. రైతులు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు సమయానికి రాయితీ పథకాలు అందచేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచర్ల మురళీనాయుడు, జిల్లా అధ్యక్షుడు చేవూరు వినయ్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 12.333 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, ఆగస్టు 6: సోమశిల పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా మంగళవారానికి 12.333 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 7,145 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా దిగువ డెల్టా 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

'కేఎన్‌ఆర్' రిపోర్టు బయట పెట్టాలి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 6 : కేఎన్‌ఆర్ పాఠశాలలో విద్యార్థి మృతి ఘటనపై వేసిన విచారణ కమిటీ రిపోర్టును బయటపెట్టాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో నాయకుల డీఆర్వో లవన్నకు మంగళవారం వినతిపత్రం అందచేశారు. ఆ పాఠశాలలో మహేంద్ర అనే విద్యార్థి మృతి చెంది పదిరోజులైనా కాంట్రాక్టర్, ఇంజనీర్లు, ప్రధానోపాధ్యాయుడిపై ఎలాంటి చర్యలు లేవన్నారు. విచారణ నివేదికను బయట పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యసాయి, హరీష్, వెంకటేష్, శివ పాల్గొన్నారు

తోకంచిలో పర్యావరణ శాఖ ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జేసీ సూర్యతేజ


పొదలకూరు, ఆగస్టు 6: తోకంచి గ్రామ సమీ పంలోని పొలాల్లో ఇన్‌చార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ మల్లవరపు సూర్యతేజ, పర్యావరణ పరిరక్షణ అధి కారి రాజశేఖర్, తహసీల్దారు మలిశెట్టి సారంగపాణి ఆధ్వర్యంలో మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సేకరణలో భాగంగా చిట్టేపల్లి, లింగంపల్లి, తోకంచి గ్రామాలకు చెందిన గ్రామస్థులతో మాట్లాడారు. వద్దూరు భాస్కరయ్యతో పొదలకూరు సర్వే నెంబరు 707లో ఓపెన్ కాస్ట్ పద్ధతిలో 2.5హెక్టార్ల విస్తీర్ణంలో చేపట్టే క్వార్ట్ మైనింగ్ ప్రాజెక్టు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇక్కడ మైనింగ్ చేసేటపుడు పర్యావరణానికి, రోడ్లు, ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పొదలకూరు ఎస్ఐ రామకృష్ణ, మనుబోలు ఎస్ఐ అజయ్‌కుమార్, రైతులు, గ్రామస్థులు, టీడీపీ నాయకులు, వైసీపీ నాయకులు, మండల స్థాయి అధికారులు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు అరికట్టాలి

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య

పొదలకూరు, ఆగస్టు 6: జిల్లాలో మాతా శిశు మరణాలను అరికట్టాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పెంచలయ్య అన్నారు. మంగళవారం పొదలకూరులో జరుగుతున్న ఆశా డే సమావేశాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. జిల్లాలో ఎక్కడ మాతా శిశు మరణాలు జరుగకూడదని, ఈ మాతా శిశు మరణాలు తగ్గించుటకు ముఖ్యంగా గర్భవతులను 12 వారాలలోపు గుర్తించాలన్నారు. ఆ వివరాలను ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి గర్భవతి ప్రతినెలా 9వతేదీ ప్రధానమంత్రి మాతృ వందన యోజన కార్యక్రమం కింద వైద్యులతో పరీక్షలు చేయించాలన్నారు. అక్కడ ఉచితంగా స్కానింగ్, రక్తపరీక్షలు నిర్వహిస్తారని తదనుగుణంగా వారికి అవసరమైన మాత్రలను కూడా పంపిణీ చేస్తారన్నారు. సీజనల్ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలకు, ఆరోగ్య సహాయకులకు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కిరణ్ రిషిత, ఆరోగ్య విస్తరణాధికారి టి.రవికుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు మస్తాన్‌బి. ఆరోగ్య సహాయకులు, మిడ్లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

10న నెల్లూరులో ఏపీటీఎఫ్ రాష్ట్ర వైజ్ఞానిక మహాసభ




రాష్ట్ర వైజ్ఞానిక మహాసభలకు అధికారులను ఆహ్వానిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కోవూరు, ఆగస్టు 6 : నెల్లూరు నగరంలోని టౌన్ హాల్లో ఈనెల 10వ తేదీన ఏపీటీఎఫ్ రాష్ట్ర వైజ్ఞానిక మహాసభ జరుగుతుందని ఆ సంఘ నాయకుడు డాక్టర్ సయ్యద్ జుల్ఫీకర్ అలీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండల విద్యావనరుల కేంద్రానికి చేరుకుని ఎంఈవోలు రహీం, చెంచులక్ష్మిలను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై చర్చించేందుకు రాష్ట్ర స్థాయి నాయకులు వైజ్ఞానిక మహాసభకు వస్తున్నారని తెలిపారు. ఈ మహాసభకు జిల్లాలోని ఉపాధ్యాయులందరూ హాజరుకావాలని కోరారు. ఆయన వెంట ఏపీటీఎఫ్ నాయకులు రాజశేఖర్, శ్రీనివాసులు ఉన్నారు.

మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డర్ పోటీల్లో వంశీ ప్రతిభ

● 80-85 కేజీల పోటీల్లో రాష్ట్రస్థాయిలో బంగారు పతకం



కోచ్, నిర్వాహకులతో బంగారు పతకం సాధించిన వంశీ

సంగం, ఆగస్టు 6: మర్రిపాడు గ్రామానికి చెందిన నల్లగట్ల వంశీ అనే యువకుడు పాలకొల్లులో జరిగిన మిస్టర్ ఆంధ్ర రాష్ట్రస్థాయి బాడీ బిల్డర్ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. మంగళవారం 80-85 కేజీల విభాగంలో తలపడిన వంశీ ప్రథమ స్థానం సాధించి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. ఈయన నెల్లూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో విద్యనభ్యసించి ప్రస్తుతం ఇంటి వద్ద ఉంటున్నాడు. అంతేకాకుండా వివిధ బాడీ బిల్డర్ విభాగాల్లో జరిగిన పోటీల్లో రెండవ స్థానం సాధించి చాంపియన్ ఆఫ్ చాంపియన్‌గా నిలిచాడు. వంశీకి గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

సెప్టెంబరు నుంచి పశుగణన

● రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాసరాజు



పశుగణన పోస్టర్ విడుదల చేస్తున్న అధికారులు

నెల్లూరు రూరల్, ఆగస్టు 6 : రాష్ట్రంలో సెప్టెంబరు 1వ తేదీ నుంచి పశుగణన నిర్వహించనున్నట్లు పశు సంవర్ధకశాఖ రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాసరాజు తెలిపారు. మంగళవారం నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టిపాళెం పశువైద్యశాల వద్ద శిక్షణ అనంతరం గణన యాప్‌కు సంబంధించిన అప్లికేషన్, పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థూల ఆదాయంలో పశువుల ద్వారా సంక్రమించే ఉత్పత్తుల శాతం ఎక్కువగా ఉందన్నారు. ఈ క్రమంలో పశుసంపదపై ఆధారపడ్డ కుటుంబాలకు వివిధ పథకాలను రూపొందించేందుకు ఈ గణన దోహదపడుతుందని చెప్పారు. 1919 నుంచి పశు గణన జరు గుతోందని, ఇప్పటి వరకు 20 సార్లు గణాంకాలు తీసిన తమ శాఖ 21వ గణను డిసెంబరు 31లోపు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. 16 రకాల మచ్చిక పశుజాతులను ఈ గణాంకాల్లో లెక్కించనున్నట్లు వివరించారు. గణాంక సిబ్బందికి పశుపెంపకందారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ జేడీ కోటేశ్వరరావు, డీడీ నాగమణి, ఏడీడీఎల్ ఏడీ జానా చైతన్యకిషోర్, సహాయ సంచాలకుడు బీవీ సురేష్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు పట్టని పరిశుభ్రత!

వరికుంటపాడు, ఆగస్టు 6: సభలు, సమావేశాల సమయంలో పరిశుభ్రతపై ఉపన్యాసాలు ఊదరగొట్టే అధికారులు తమ సొంత కార్యాలయాల తీరును మాత్రం పట్టించుకోకుండా మరిచిపోయారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం ప్రజలు, ప్రజా ప్రతినిధులతో రద్దీగా ఉండే మండల పరిషత్, వెలుగు, ఉపాధిహామీ, హౌసింగ్ కార్యాలయాల చుట్టూరా అపరిశుభ్రత విలయతాండవం చేస్తుంది. దీన్ని పట్టించుకొనే వారు కరువయ్యారు. గదుల చుట్టూరా చెత్తా, చెదారం పేరుకపోవడంతో పాటు ఏపుగా పెరిగిన కంపచెట్లు, ఇతరత్రా వ్యర్థాలు నెలల తరబడి దర్శనమిస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం దారుణమని ప్రజలు మండిపడుతున్నారు. ప్రాంగణంలోను అపరిశుభ్రత పుణ్యమాని విషపురుగులు సంచరించే ప్రమాదం దాపురించింది. కార్యాలయాలకు వెళ్లే ప్రజలు దీన్ని గమనించి అటువైపు వెళ్లలేకపోతున్నారు.



వరికుంటపాడు: మండల కార్యాలయం వెనుక పేరుకపోయిన చెత్తాచెదారం

లవణాలు ఎక్కువైతే పైరులో పెరుగుదల ఉండదు

ఏఎస్ పేట, ఆగస్టు 6: వరి పొలాల్లో లవణాలు ఎక్కువైతే పైరులో పెరుగుదల సక్రమంగా ఉండదని ఆత్మకూరు ఏడీఈఏ దేవసేన తెలిపారు. మంగళవారం ఆమె పందిపాడు రైతులు సాగు చేసిన వరి పంటలను పరిశీలించి మాట్లాడారు. వరి పైరు సక్రమంగా పెరగలేదని పంటలకు మడులు ఏర్పాటు చేసి ఏ మడికి ఆమడికి సా గునీరు పారించి నీరు తీసివేయడం ద్వారా లవణాల ప్ర భావం తగ్గించవచ్చన్నారు. అలా చేస్తే పైరులో పెరు గుదల బాగుంటుందన్నారు. కార్యక్రమంలో ఏవో రజినీ, ఏఈవో చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు బాధ్యతల స్వీకరణ

మర్రిపాడు, ఆగస్టు 6: తహసీల్దారు స్వప్న మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల అనంతరం జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం పనిచేస్తున్న ఆమె డిప్యూటీ తహసీల్దారు ప్రమోషన్‌తో మర్రిపాడుకు బదిలీపై వచ్చారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు



అనంతసాగరం, ఆగస్టు 6: ఉప్పలపాడు సమీపంలోని ప్రభుత్వ భూమిలో మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో మట్టిని తవ్వి ట్రాక్టర్లతో మంచాలపల్లికి తరలించారు. విష యాన్ని రెవెన్యూ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 6: ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి జయశ్రీ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు తమ పరిధిలోని రైతు సేవాకేంద్రాల్లో వ్యవసాయ, ఉద్యానవన సహాయకులను సంప్రదించి ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. ఇలా చేస్తేనే ప్రభుత్వ రాయితీలు వరిస్తాయన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై బిందు, తుంపర్ల పరికరాలను అందజేస్తుందని, అవసరమైన రైతులు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ధ్రువపత్రాల మంజూరుపై విచారణ

ఉదయగిరి రూరల్, ఆగస్టు 6: మోచి(ఎస్సీబీ) కులాల వారికి ధ్రువీకరణ పత్రాల మంజూరుపై ఇన్‌చార్జి త హసీల్దారు షేక్ జహీర్‌బాబు రెవెన్యూ అధికారులతో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మోచి కులానికి చెందిన 15కుటుంబాలు ఉన్నాయని చెప్పారు. 2016 వరకు వారికి కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారని, అనంతరం మంజూరు చే యడం నిలిపివేశారన్నారు. అందుకు గల కారణాలపై వి చారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తా మన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు జాఫర్, వెంకటేశ్వర్లు, మస్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.

నివేదిక సిద్ధం చేయండి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 6: ఈ నెల 20న జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆరు నెలల నుంచి 19 ఏళ్ల వయసులోపు విద్యార్థుల నివేదికను సిద్ధం చేయాలని మండల వైద్యాధికారి శివకల్పన తెలిపారు. మంగళవారం గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమీక్షించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అనం తరం మాత్రలు మింగించాలన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సంబంధిత రికార్డులు పరిశీలించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన

అనంతసాగరం, ఆగస్టు 6: మంచాలపల్లి ఎస్సీ కాలనీ వాసులు మంగళవారం ఆత్మకూరు-సోమశిల రోడ్డుపై తాగు నీటి కోసం స్థానికులు ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. వీరికి సీపీఎం నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా నాయకులు అన్వర్‌బాష, వెంకటేశ్వర్లు, రవి, శంకరయ్యలు మాట్లాడారు. కాలనీలో వారం రోజులుగా నీటి సరఫరా జరగడం లేదన్నారు. ఉన్న చేతిపంపు కూడా పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



అనంతసాగరం: ఖాళీ బిందెలతో నిరసన తెలియచేస్తున్న కాలనీవాసులు

ఆత్మకూరు: పట్టణంలోని ఎల్‌ఆర్‌పల్లి ప్రజలకు తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని మంగళవారం సాయంత్రం సీపీఎం నాయకులు స్థానికులతో కలిసి రాస్తోరోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కె డేవిడ్‌రాజు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ సంధాని మాట్లాడారు. తాగునీటి పైపులు మరమ్మతులతో నీటి సమస్యల వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజులుగా ఈ ప్రాంతంలో నీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు మండిపడ్డారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.



ఆత్మకూరు: రాస్తోరోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, మహిళలు

జీవితంలో ఇక జగన్‌రెడ్డి సీఎం కాలేడు

● ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి

వింజమూరు, ఆగస్టు 6: వైఎస్ జగన్‌రెడ్డి జీవిత కాలంలో ఇక ముఖ్యమంత్రి కాలేరని ఆయన గ్రాఫ్ బాగాలేక నా గ్రాఫ్ బాగాలేదు అన్నాడని ఉదయగిరి మాజీ శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. వింజమూరు పంచాయతీలోని జీబీకేఆర్ ఎస్టీ కాలనీ లోని రామ మందిరానికి పంచలోహ విగ్రహాలను అందజేసి క్రమంలో ముందురోజు జరుగు తున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం స్థానిక బంగ్లా సెంటర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పరిపాలన విధానాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దగ్గర నేర్చుకోవాలని కొనియడారు. ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ ఉన్నతంగా వ్యవహరిస్తూ పరిపాలన విభాగంలో ఇప్పటికే తనకంటూ ఒక స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. వైసీ పీ ప్రభుత్వంలో అన్ని శాఖలను నిర్వీర్యం చేసిన ఘనుడు జగన్‌రెడ్డి అన్నారు. ఎన్నికలకు ఆరునెలల ముందే తెలుగుదేశం పార్టీలో చేరి పార్టీ విజయానికి కృషి చేశానని తెలిపారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కోసం తాను, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, చంచలబాబుయాదవ్, మన్నేటి వెంకటరెడ్డిలు ఎంతో కృషి చేశామ న్నారు. ఎన్డీయే ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందని ఆయన జోస్యం చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, వేణు, జూపల్లి రాజారావు, చల్లా మాల్యాద్రి, పాములపాటి మాల్యాద్రి, పెరుమాళ్ల షేక్.రఫీ, వసంతరావు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

సీతారామపురం, ఆగస్టు 6: అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన గారపాటి చెన్నకేశవులు (40)మంగళవారం సీతారామపుం బెస్తకాలనీలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంటును పునరుద్ధరించే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కూలిపోయాడు. గమనించిన స్థానికులు 108అంబులెన్స్‌లో సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్య సిబ్బంది పరీక్షలు జరిపి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈయన సీతారామపురం తోటకాలనీలో నివాసం ఉంటూ ప్రైవేటుగా కరెంట్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి కుమారుడు, కమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు కోరారు.

కొలగాని రామయ్య చౌల్ట్రీ ఆక్రమణలపై చర్యలు

● దుకాణాదారులకు నోటీసుల జారీ

ఆత్మకూరు, ఆగస్టు 6: పట్టణ నడిబొడ్డులోని కొలగాని రామయ్య చౌల్ట్రీని కొందరు కబ్జా చేసి దుకాణాలు, భవనాలు నిర్మించి ఉన్నారని, వాటి తొలిగింపునకు మంగళవారం ఎండో మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎండోమెంట్ అధికారులు, సిబ్బంది కొలగాన సత్రంలోని దుకాణాదారులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన చెప్పారు. అంతకుముందు సంబంధిత స్థలంలోని దుకాణాలన్నింటినీ వారు పరిశీలించారు. స్థానిక బీఎస్‌ఆర్ సెంటర్‌కు సమీపంలోని ప్రాంతం, వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో రోడ్డుపై నుంచి రామకృష్ణ థియేటర్ వరకు వస్తరించి ఉన్న కొలగాని రామయ్య సత్రానికి సంబంధించిన స్థలం వరకు ఉన్న దుకాణాల యజమానుల పేర్లను నమోదు చేసుకున్నారు. కార్యక్రమానికి ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా ఎస్‌ఐ ముత్యాలరావు ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ సత్యనారాయణ, పోలీసుల సిబ్బంది ఉన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికల్లో నియమావళి పాటించాలి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 6: ఈ నెల 8న ప్రభుత్వ పాఠశాలల్లో జరగనున్న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో నియమ నిబంధనలు పాటించి ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సూచించారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎస్ఐ కర్నాటి ఇంద్రోనారెడ్డితో కలిసి ప్రధానోపాధ్యాయులతో సమావేశం అయ్యారు. చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నికల నియమావళిని అనుసరించి ఎన్నుకోవాలన్నారు. ఎన్నికల అనంతరం వారి వివరాలను అధికారులకు అందజేయాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే సమాచారం అందించాలన్నారు. మనబడి మన భవిష్యత్ పనులపై సమీక్షించారు. మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలని సూచించారు.

తాగునీటి వసతిపై సర్వే చేపట్టాలి

వరికుంటపాడు, ఆగస్టు 6: గ్రామాల్లో తాగునీటి వస తిపై సమగ్ర సర్వే చేపట్టాలని ఎంపీడీవో వెంకట కృష్ణకుమారి సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆమె పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో కలిసి సమావేశం అయ్యారు. ప్రతి ఇంటికెళ్లి తాగునీటి వ సతిపై, వసతిలేని గృహాలను గుర్తించాలని సూచించారు. అనంతరం పంచాయతీల వారీగా నివేదికలు సేకరించాలన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి

కోలగట్లలో గడ్డివామి దగ్ధం

సంగం, ఆగస్టు 6: కోలగట్లలో గట్టుపల్లి చిన్న పెంచలయ్య అనే రైతుకు చెందిన పది ఎకరాల గడ్డివాము మంగళవారం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష ఆర్థిక నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. వివరాల మేరకు.. తన ఇంటి పక్కనే పశువుల కోసం వరిగడ్డి వాము వేశాడు. ఉదయం 8గంటల సమయంలో దానికి నిప్పు అట్టుకుని మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చే శారు. కానీ మంటలు అదుపు కాలేదు. దీంతో స్థానికులు ఆత్మకూరు అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదు పు చేసి ఇళ్లకు మంటలు వ్యాపించకుండా నివారించారు. ప్రమాదం ఎలా జరిగిందో తెలియరాలేదు. గుర్తుతెలియని వ్యక్తులు పొగ తాగి ఆర్పకుండా పారవేయడంతో గాలికి నిప్పు రవ్వలు రేగి ఈ మంటలు వ్యాపించి ఉంటాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

కావలి, ఆగస్టు 6: చుండూరులో అగ్రవర్ణాల దాడిలో మృతి చెందిన దళితులకు ఇప్పటికి న్యాయం జరుకగపోవటం అన్యాయమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ట్రంకురోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. మల్లి మాట్లాడుతూ గుంటూరు జిల్లా చుండూరులో 1991 ఆగస్టు 6న సినిమాహాల్‌లో జరిగిన చిన్న గొడవ కారణంగా 12 మందిని ఆ రాత్రి నరికి చంపారన్నారు. ఈ విషయంపై హత్య చేసిన వారందరికి గుంటూరు జిల్లా కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తే ఆ తర్వాత హైకోర్టు దానిని కొట్టి వేసిందన్నారు. హత్య చేసినవారి సామాజిక వర్గానికి చెందిన జడ్జితో కేసును కొట్టివేయంచగా అందుకు ప్రతిఫలంగా వైసీపీ ప్రభుత్వంలో ఆ జడ్జీకి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కీలక పదవి ఇప్పించడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో దళితసంఘాల నేతలు ముక్కు మోహన్‌రావు, జరుగుమల్లి విజయరత్నం, అలూరి బ్రహ్మయ్య, డీ.రమేష్, ఆత్మకూరి బాలచంద్ర, తిరుపతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు శ్రావణమాస శోభ



ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి, దుర్గాభ్రమరాంబ

కావలిటౌన్, ఆగస్టు 6 : పట్టణంలోని ఆలయాలకు శ్రావణమాస శోభ సంతరించుకుంది. మంగళవారం పట్టణ పరిధిలోని పాతూరు శివాలయం, కలుగోళ శాంభవీదేవి ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, వెంగళరావునగర్ ఆలయ క్షేత్రాలకు భక్తులు పెద్దఎత్తున చేరుకుని పూజలు నిర్వహించారు. పాతూరు శివాలయంలో దుర్గాభ్రమరాంభకు ఖడ్గమాల అలంకారంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కొత్తబజారులోని కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక అలంకారంలో పూజలు నిర్వహించారు.

'పాలిటెక్నిక్'లో సమస్యలు పరిష్కరించాలి

● ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డికి వినతి

కావలి రూరల్, ఆగస్టు 6: కావలి మండలం రుద్రకోటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.సుశీల్ కుమార్‌ప్రియ, అధ్యాపక బృందం ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం వారు ఎమ్మెల్యేని ఆయన నివాసంలో కలసి కళాశాలలోని సమస్యలను వివరించారు. కళాశాలకు చుట్టూ ప్రహరీ నిర్మించాలని, కళాశాల ప్రాంగణంలో గుంటల మిట్టలను చదును చేయించాలని కోరారు. ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ విభాగాల బ్రాంచీల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతులు మంజూరు చేయించాలన్నారు. కళాశాల విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని, రుద్రకోట పంచాయతీ నుంచి కళాశాలకు తాగునీటి వసతి కల్పించాలన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం కళాశాల ముందు బస్ షెల్టర్ ఏర్పాటు చెయ్యాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

పోలేరమ్మకు ఎమ్మెల్యే పూజలు

కావలి : కావలి నియోజకవర్గ ప్రజలందరినీ చల్లగా చూడాలని కోరుతూ కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పట్టణంలోని 36వ వార్డు పెంకులఫ్యాక్టరీ కాలనీలో మంగళవారం పోలేరమ్మకు పూజలు చేశారు. పోలేరమ్మకు జరిగిన పొంగళ్ల కార్యక్రమంలో టీడీపీ నాయకుడు తాతా వెంకటేశ్వర్లు ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్‌బాబు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, జనసేన నాయకుడు మన్నేపల్లి రిషికేష్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలో బోర్డు ఏర్పాటు

లింగసముద్రం, ఆగస్టు 6 : లింగసముద్రం మీ సేవా కేంద్రం సమీపంలోని వివాదాస్పద ఆర్‌అండ్‌బీ స్థలంలో రెవెన్యూ, ఎంపీడీవో, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు బోర్డును ఏర్పాటు చేశారు. గ్రామ సర్వే నంబరు 77లో ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఉన్న ఆ శాఖకు చెందిన ఖాళీ స్థలంలో గత నెల 25వ తేదీన రాత్రి ఓ వ్యక్తి రేకుల షెడ్డు నిర్మించారు. అధికారులు ఈ షెడ్డు నిర్మాణం అక్రమమని కూల్చి వేశారు. దీనిపై అప్పట్లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో మంగళవారం సాయంత్రం అధికారుల ఆదేశాలతో ఆ స్థలంలో ఇది ప్రభుత్వ స్థలమని దీనిని ఎవరైనా ఆక్రమించినచో చట్టపరమైన చర్యలు తీసుకోబడునని బోర్డు ఏర్పాటు చేశారు.



ఆర్‌అండ్‌బీ స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు

రామతీర్థం జలాశయం కట్టపై కంపచెట్ల తొలగింపు

కందుకూరు, ఆగస్టు 6: కందుకూరు మున్సిపాలిటీ ప్రజల దాహార్తి తీర్చే రామతీర్థం మంచినీటి పథకం సమ్మర్ స్టోరేజి ట్యాంకు కట్టపై చిల్లచెట్లు, ఇతర కంపచెట్ల తొలగింపుకు మున్సిపల్ అధికారులు మంగళవారం పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఇటీవల సమ్మర్‌స్టోరేజి ట్యాంకును సందర్శించిన సందర్భంగా కట్టపై దట్టంగా కంపచెట్లు పెరిగి ఉండటం అక్కడ అపరిశుభ్ర వాతావరణం కనిపించటంతో తక్షణం కంపచెట్లు తొలగించి మంచినీటి చెరువు పరిసరాల్లో పరిశుభ్ర వాతావరణం ఉండేలా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో కంపచెట్ల తొలగింపు పనులకు శ్రీకారం చుట్టారు.



జలాశయం కట్టపై చెట్లు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి

అల్లూరు, ఆగస్టు 6 : విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ స్కూల్ అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో రవీంద్రనాథ్ అన్నారు. మండలంలోని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలతో మంగళవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓపెన్ స్కూల్ చేరికలు, విద్యా కమిటీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించి పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలన్నారు.

ఇస్కపల్లిలో హర్ ఘర్ తిరంగ వేడుకలు

అల్లూరు, ఆగస్టు 6 : ప్రభుత్వాలు చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని మండలంలోని ఇస్కపల్లి జడ్పీ హైస్కూలులో మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు దేశనాయకుల వేషధారణలో ప్రత్యేక దేశభక్తి గీతాలు ఆలపించారు. నృత్యాలు, వివిధ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో జ్యోతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటాలన్నారు. ప్రతి ఇంటా స్వాతంత్ర్య దినోత్సవం నాడు మువ్వన్నెల జెండాను ఎగురవేయాలన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పాటుపడిన దేశ నాయకుల త్యాగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



వేషధారణలోని చిన్నారులతో ఎంపీడీవో జ్యోతి

దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు

కందుకూరు, ఆగస్టు 6: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అలింకో సహాయంతో సక్షమ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు అవసరమైన ఉకరణాలు ఉచితంగా అందజేస్తున్నందున అవసరమైన దివ్యాంగులు బుధ, గురువారాలలో స్థానిక సక్షమ్ దివ్యాంగ కేంద్రంలో సంప్రదించాలని చెన్నా రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న స్వర్ణ స్వయం కృషి మానసిక దివ్యాంగుల పాఠశాల ఆవరణలో బ్యాటరీ ట్రైసైకిళ్లు, ట్రై సైకిళ్లు, వీల్ చైర్స్ చంక కర్రలు, వినికిడి యంత్రాలను వారి అవసరాలను బట్టి ఉచితంగా అందజేస్తారని పేర్కొన్నారు. 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు వీల్‌చైర్స్ వినికిడి యంత్రాలను సదరమ్ సర్టిఫికెట్‌తో పనిలేకుండా వారి అవసరాన్ని బట్టి ఇసాంతరని, బ్యాటరీ ట్రైసైకిళ్లు, ట్రై సైకిళ్ల కోసం సదరం సర్టిఫికెట్, యుడీఐడీ కార్డు సమర్పించాలని పేర్కొన్నారు. ఉపకరణాలు అవసరమైన ప్రతిఒక్కరూ ఆధార్, రేషన్‌కార్డు, ఫొటో తప్పకుండా తీసుకుని రావాలని తెలిపారు. గత మూడేళ్లలో ఉపకరణాలు పొందిన వారు అనర్హులని, 2023లో జరిగిన అలింకో క్యాంపునకు హాజరైన వారికి త్వరలో ఉపకరణాల పంపిణీ జరగనున్నందున వారు రావాల్సిన అవసరం లేదని తెలిపారు. వివరాలకు 9949334606 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఒరిగిన విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు

వలేటివారిపాలెం, ఆగస్టు 6 : వలేటివారిపాలెంలో జాతీయ రహదారి పక్కన పొలాల్లో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలకు ఆ శాఖ ఏఈ తాటికొండ మధుబాబు తమ సిబ్బందితో మంగళవారం మరమ్మతులు చేయించారు. 'ఒరిగిన విద్యుత్ స్తంభాలతో పొంచి ఉన్న ప్రమాదాలు' అని ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన శీర్షికకు విద్యుత్ ఏఈ స్పందించారు. వెంటనే మరమ్మతులు చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతికి రైతులు, కూలీలు కృతజ్ఞతలు తెలిపారు.



విద్యుత్ స్తంభాలకు చేస్తున్న మరమ్మతులు

తహసీల్దారుకు సత్కారం

కావలిటౌన్, ఆగస్టు 6: కావలి తహసీల్దారుగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రావణ్‌కుమార్‌ను మంగళవారం డివిజన్ విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల సంఘం నేతలు కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అధ్యక్షుడు మొగల్ సిరాజ్‌బేగ్ తదితరులు పెన్షనర్ల సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తను ఎల్లవేళలా సిద్ధమని ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దారు హామీ ఇచ్చారు.

కార్పొరేట్ జాబ్స్‌కు కఠోర సాధన ముఖ్యం

కందుకూరు, ఆగస్టు 6: కఠోర సాధనతోనే కార్పొరేట్ జాబ్స్ సాధించవచ్చునని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య పేర్కొన్నారు. క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ (సీఆర్‌టీ) ముగింపు సందర్భంగా మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కష్టేఫలి అన్న నానుడిని ఆచరిస్తేనే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించగలుగుతారని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మాక్స్ శిక్షణసంస్థ చైర్మన్ కోటిరెడ్డి, కళాశాల టెక్నికల్ డైరక్టర్ డాక్టరు కె.విజయ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 20మందికి నగదు అవార్డులను అందజేశారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

లింగసముద్రం, ఆగస్టు 6 : కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాలతో లింగసముద్రం పంచాయతీలోని బలిజపాలెంలో విద్యుత్‌శాఖ అధికారులు 100 కేవీ ట్రాన్స్‌పారం ఏర్పాటు చేశారు. గ్రామంలో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుండడంతో గ్రామస్థులు ఎమ్మెల్యే నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే విద్యుత్ ట్రాన్స్‌పారం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో మంగళవారం ఏడీఈ విజయ్‌బాబు, మండల ఏఈ షేక్ ఫిరోజ్‌లు ట్రాన్స్‌పారం ఏర్పాటు చేశారు.

బీదను కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి

నెల్లూరు(వైద్యం): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం నగరంలోని బీద నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా బీద రవిచంద్ర ఇంటూరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీద జ్యోతి ఉన్నారు.

రోడ్డు ఆక్రమణలపై అధికారుల పరిశీలన

కావలి, ఆగస్టు 6: కావలి పట్టణం ముసునూరులోని కేజీబీవీ పాఠశాలకు ఎదురుగా ఉన్న రోడ్డును ఆక్రమించారని పాఠశాల ప్రిన్సిపాల్ కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే దానిపై విచారించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్పందించిన కావలి ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్‌లు మంగళవారం పాఠశాల వద్దకు వెళ్లి అక్కడ పరిశీలించారు. జగనన్న కాలనీకి చెందిన మెగాలేఅవుట్ పక్కనే ఎవరో రోడ్డు ఆక్రమించి నాన్ లే అవుట్ వేసేందుకు రాళ్లు పాతడంతో అధికారులు ఆ రాళ్లను తొలగింపజేశారు.

రైల్వే వైద్యశాలలో ఉచిత వైద్య శిబిరం

బిట్రగుంట, ఆగస్టు 6: బిట్రగుంట రైల్వే వైద్యశాలలో మంగళవారం ఒంగోలు కిమ్స్, రైల్వే ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి ప్రభాకర్ ఆధ్వర్యంలో 162 మందికి పైగా వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గుండె, కీళ్లు, జీర్ణకోశ, స్త్రీల సంబంధిత, కంటి, సాధారణ వ్యాధులకు వైద్యనిపుణులు కపిల్ కార్తికేయ, అశోక్ కుమార్, సుజనీ, హైందవి, రామాంజనేయులు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరినాయుడు, అంకిరెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళులు

కావలిటౌన్, ఆగస్టు 6: ప్రజా యుద్ధనౌక గద్దర్ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఆయన అభిమానులు సిద్ధు, దేవరకొండ శ్రీను, ఆలా శ్రీను మిత్రబృందం ఆధ్వర్యంలో బ్రిడ్జి కూడలిలో శిబిరాన్ని ఏర్పాటు చేసి గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ ప్రధాన కూడళ్లలో గద్దర్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఆయనపై అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు మల్లి, శ్రీధర్‌రెడ్డి, జనసేన రూరల్ అధ్యక్షుడు తిరుపతిస్వామి, విద్యార్థి నాయకులు విజయ్, సాదు శ్రీధర్ పాల్గొన్నారు.

రెంటాల రాఘవేంద్రకు డాక్టరేట్

కావలిటౌన్, ఆగస్టు 6: విక్రమ సింహపురి యూనివర్శిటీ కావలి పీజీ కళాశాల రీసెర్చ్ స్కాలర్ రెంటాల రాఘవేంద్రకు డాక్టరేట్ లభించింది. కామర్స్ విభాగాధిపతి ఆచార్య సీహెచ్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఫైనాన్షియల్ పర్ఫార్మెన్స్ ఆఫ్ సెలెక్టెడ్ పబ్లిక్ సెక్టార్ బ్యాంక్స్ ఇన్ ఇండియా ఎ కంపారిటివ్ స్టడీ అనే అంశంపై చేసిన పరిశోధనకు వీఎస్‌యూ డాక్టరేట్ ప్రదానం చేసిందని రాఘవేంద్ర తెలిపారు. తన పరిశోధనకు మార్గదర్శకుడు ఆచార్య శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్‌సేవా లోపాలు, సమస్యలు పరిష్కరిస్తాం

● సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి ● పొదలకూరులో అదాలత్ నిర్వహణ

పొదలకూరు, ఆగస్టు 6: విద్యుత్ వినియోగదారుల సేవా లోపాలు, సమస్యలను పరిష్కరించడమే విద్యుత్ అదాలత్ ముఖ్య ఉద్దేశ్యమని కన్స్యూమర్ గ్రీవెన్స్ రేడియేషన్ ఫోరం (సీజీఆర్‌ఎఫ్) చైర్‌పర్సన్ వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి తెలిపారు. మంగళవారం పట్టణ గేట్‌సెంటర్‌లోని విద్యుత్ కార్యాలయం ఆవరణలో విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమస్యల సత్వర పరిష్కారానికి నిర్వహిస్తున్న విద్యుత్ అదాలత్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కిందిస్థాయిలో సమస్యలు పరిష్కారం కాకుంటే కన్స్యూమర్ గ్రీవెన్స్‌సెల్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. మండలంలోని నావూరు, అంకుపల్లి గ్రామాల్లో సబ్‌స్టేషన్ ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి సంబంధించి నాలుగు వినతులు వచ్చాయ న్నారు. విద్యుత్ చట్టం 2003 ప్రకారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక అనేది రైతులు, వినియోగదారులకు న్యాయం చేకూర్చేలా కృషి చేస్తుందన్నారు. రైతుల పొలాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు చోరీ చేసినపుడు రైతులు ఆయా స్టేషన్‌లలో ఫిర్యాదు చేస్తే వాటికి సంబంధించి చాలా పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. అనంతరం ఎస్ఈ విజయన్ మాట్లాడారు.



వినియోగదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

వినియోగదారులకు ఈ ప్రాంతంలో మెరుగైన సేవలు అందించేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉండాలన్నారు. వినియోగదారులు ఫిర్యాదులను నేరుగాను కాకుండా ఈ- మెయిల్.. ఫోన్ నెంబర్ల ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్థికసభ్యులు రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యులు ఎస్ఎల్ అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు జి.ఈశ్వరమ్మ, విద్యుత్ కార్యాలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సోమశేఖరరెడ్డి, ఏడీలు సురేంద్రబాబు, అశోక్, భానునాయక్, ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ గ్రామోత్సవం



బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 6: బుచ్చిరెడ్డిపాళెం రాఘవరెడ్డికాలనీలో కొలువైవున్న పోలేరమ్మ జాతర మహోత్సవం మంగళవారంతో ముగిసింది. ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని ప్రత్యేక పుష్పాలంకరణ, విద్యుద్దీపాలు, డప్పులమోత, భక్తజనం నడుమ సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయంవరకు వైభవంగా గ్రామోత్సవం జరిగింది. ఉత్సవానికి ఉభయదాతలుగా వింజం రామానాయుడు కుటుంబం వ్యవహరించింది.

'అసత్య ఆరోపణలు మానుకోవాలి'

మనుబోలు, ఆగస్టు 6: భూములు ఆక్రమించానంటూ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తనపై చేసిన అసత్య ఆరోపణలు మానుకోవాలని కొమ్మలపూడి వైసీపీ నాయకులు చెందులూరు శ్రీనువాసులు సూచించారు. 2014నుంచి టీడీపీ హయాంలోనే తన భూమికి పట్టాలు ఉన్నాయని, వాస్తవాలు తెలుసుకోకుండా ఎమ్మెల్యే స్థాయిలో రైతులపై ఆరోపణలు చేయడం తగదన్నారు. ఆయన వెంట చెన్నూరు రఘురామయ్య, గుర్రం ప్రభాకర్, కో-ఆప్షన్ సభ్యుడు నాగూర్‌భాషా పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 6: బుచ్చిలోని 2వ సచివాలయం పరిధిలోని పూలబావితోటలో, మండలంలోని పెనుబల్లి (మెయిన్) అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులకు సీమంతంచేశారు. ఈ కార్యక్రమాలలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఉమ, శకుంతల, టీడీపీ నాయకులు ఎంవీ. శేషయ్య, తాళ్ళస్వామి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూముల పరిశీలన

మనుబోలు: చెరుకుమూడిలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనట్లు వాటి పై విచారణ చేయాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తహసీల్దార్ సుబ్బయ్యను కోరారు. మంగళవారం తహసీల్దార్ స్పందించి ఆక్రమిత భూములను పరిశీలించారు. సర్వే నెంబర్ 23-2, మరో సర్వేనెంబర్ 330లో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఆర్‌సీ ద్వారా కొన్ని భూములకు అసైన్‌మెంట్ పట్టాలు ఇచ్చి ఉన్నాయన్నారు. అన్నింటినీ పరిశీలించి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామ న్నారు. కార్యక్రమంలో ఆర్ఐ. సుధీర్, వీఆర్‌వో అఖిల్ పాల్గొన్నారు.

నేడు చేనేతల ర్యాలీ

నెల్లూరు(వ్యవసాయం) : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంలో చేనేతల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ అధ్యక్షుడు బుదవరపు బాలాజీ ఓ ప్రకటనలో తెలిపారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి టౌన్‌హాల్ వరకు జరిగే ఈ ర్యాలీలో చేనేత కుటుంబాలు పాల్గొనాలని కోరారు.

బీదను కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి

నెల్లూరు(వైద్యం) : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రను, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం నగరంలోని బీద నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

టీడీపీ నాయకుడి ఔదార్యం

పొదలకూరు, ఆగస్టు 6: చాటగొట్ల గ్రామ టీడీపీ యువ నాయకుడు పచ్చిపాల అయ్యన్న మంగళవారం ప్రాథమిక పాఠశాల విద్యా ర్థులకు యూనిఫాంను కుట్టించి చేయించి వారికి అవసరమైన విద్యోపకరణాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు సునంద, అరుణకుమారి, హరిప్రియ, జీవీఆర్, సురేంద్ర, ప్రతీష్, అనిల్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన కూటమి నేతలు

వెంకటాచలం, ఆగస్టు 6: మండల తహసీల్దార్ శ్రీనివాసులును మంగళవారం నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, ఉపాధ్యక్షుడు చల్లా నాగార్జున్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి వల్లూరు రమేష్‌నాయుడు కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. వీరి వెంట సీనియర్ నాయకులు రాధాకృష్ణారెడ్డి, మేదరమెట్ల కోదండయనాయుడు, రావూరి పద్మనాభనాయుడు, ఉప్పలపాటి ధనుంజయనాయుడు, కందిమళ్ల శ్రీనివాసులు నాయుడు ఉన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నాయకులు



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

మనుబోలు, ఆగస్టు 6: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్న సీహెచ్ సుబ్బయ్యను మంగళవారం మనుబోలు టీడీపీ నాయకులు తిరుపతి పార్లమెంట్ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డిలు శాలువాకప్పి, పూలమలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాయపాటి కిరణ్‌కుమార్, కలికి రమేష్‌రెడ్డి, రావుల అంకయ్య గౌడ్, పచ్చిపాల చంద్రశేఖర్‌రెడ్డి, శివుడు రాజాగౌడ్, మారంరెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. రేషన్ డీలర్లు కలిసి తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

కామాక్షితాయికి వైభవంగా కాత్యాయనీ వ్రతం



కాత్యాయనీ వ్రతంలో పాల్గొన్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 6: మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో మంగళవారం శ్రావణ మాసం సందర్భంగా కామాక్షితాయికి కాత్యాయని వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా ఆలయ పండితులు, పురోహితులు, అర్చకులు అమ్మవారిని స్వర్ణాభరణాలు, పుష్పాలంకరణతో కాత్యాయనీవ్రతం పూజల్లో కొలువుదీర్చారు. వ్రతం వల్ల భక్తులకు కలిగే ఫలితాలు గురించి పండితులు వివరించారు. అనంతరం ముందుగా గణపతిపూజ, కలశపూజలు నిర్వహించి కాత్యాయనీ వ్రతంలో భాగంగా భక్తుల గోత్రనామాలతో కుంకుమ పూజ నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులకు వ్రతం కథ వినిపించి అమ్మవారి ప్రసాదములు పంపిణీ చేశారు. పూజాకార్యక్రమాలను ఆలయ ఈవో ఏవీ.శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శిగా సుమన్‌తేజ

మనుబోలు, ఆగస్టు 6: రాష్ట్ర మాలమహానాడు కార్యదర్శిగా చెర్లోపల్లి అల్లూరు సుమన్‌తేజను ఎన్నుకున్నారు. మంగళవారం గుంటూరులో జరిగిన మాలమహానాడు సభలో రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు కిషోర్ ఆయన పేరును ప్రకటించారు. చెర్లోపల్లి టీడీపీ నాయకులు కలికి వేణుగోపాల్‌రెడ్డి, పొన్నూరు అశోక్‌లు సుమన్‌తేజను అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ

ఇందుకూరుపేట, ఆగస్టు 6 : మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే కార్యక్రమం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సి.కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా మలేరియా అధికారి ఇ.హుస్సేనమ్మ ము ఖ్య అతిథిగా పాల్గొని సిబ్బందికి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆమె మా ట్లాడుతూ కీటక జనిత వ్యాధులపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించ డంతోపాటు దోమలను నివారించే విధానాల గురించి, దోమతెరలు వాడకం గురించి తెలియజేయాలన్నారు. సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు డెంగ్యూ, మలేరియా సంబంధిత టెస్టు లు చేయాలని తెలిపారు. ప్రభుత్వ హాస్టళ్లలో మలేరియా, డెంగ్యూ, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడంతోపాటు ముందు జాగ్రత్త నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, సబ్ యూనిట్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్‌లు రమా, సతీష్‌బాబు, ఎల్ఎల్‌టీ హైమా, వైద్య సిబ్బంది, ఆశా వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మం గెలిచిందంటూ సైకిల్‌యాత్ర

మనుబోలు, ఆగస్టు 6: సార్వత్రిక ఎన్నికల్లో ధర్మం గెలిచిందంటూ చిత్తూరువాసి ఆర్.మురళి చేపట్టిన సైకిల్‌యాత్ర మంగళవారం మనుబోలుకు చేరుకుంది. ఈ నెల 2న చిత్తూరులో యాత్రను విజయవాడకు ప్రారంభించారు. పార్టీ అధిష్ఠానం వద్ద ఆశీస్సులు తీసుకునేందుకు వెళుతున్నానని యాత్రికుడు మురళి తెలిపారు. తన సైకిల్‌కు ముందు, వెనుక ధర్మం గెలిచిందంటూ బోర్డులు పెట్టుకుని, సైకిల్ చుట్టూ మూడు పార్టీల జెండాలు పెట్టుకుని యాత్ర చేయడం హైవే ప్రయాణికులను ఆకట్టుకుంది.



సైకిల్‌పై వెళుతూ విక్టరీ సింబల్ చూపుతున్న యాత్రికుడు

అదుపుతప్పి సిమెంటు లారీ బోల్తా

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 6: మండలంలోని దామరమడుగు పరిధిలో ఆర్ఆర్ నగర్ (మఠం కాలనీ) వద్ద ముంబై జాతీయ రహదారిపైన మంగళవారం వేకువజామున ఓ సిమెంటు ట్యాంకర్ లారీ అదుపుతప్పి రోడ్డుపక్కనే ఉన్న పొలాల్లో బోల్తాకొట్టింది. నెల్లూరు నుంచి కడపవైపు వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ మఠం కాలనీ వద్దకు వచ్చే సరికి డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో డ్రైవర్ ప్రాణాపాయం తప్పి స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

బీసీ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 6: బుచ్చిరెడ్డిపాళెంలోని బీసీ హాస్టల్‌లో 130 మంది బాలికలకు సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏబీసీడబ్ల్యూవో ఆత్మకూరు డివిజన్ అధికారిణి ఎం. శ్రీదేవి, ఎంఈవో దిలీప్‌కుమార్, వార్డెన్ ఏవీఎస్ఆర్ లక్ష్మి, పాల్గొన్నారు. సహారా సొసైటీ అధ్యక్షుడు ఎస్‌కే.ఎజ్దానీని అభినందించారు. స్వర్గీయ పుచ్చలపల్లి రాధాకృష్ణారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు దాతగా సతీష్‌కుమార్ సహకారంతో దుప్పట్లు పంపిణీ చేసినట్లు ఎజ్దాని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయక్‌బాషా, ప్రతాంతంతుల్లా పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ప్రధాని చిత్రపటాన్ని ఉంచాలి : బీజేపీ

నెల్లూరు(వైద్యం) : ప్రధాని మోదీ చిత్రపటాన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రదర్శించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రధాని చిత్రపటాన్ని జీజీహెచ్ హెచ్‌వోడీ డాక్టర్ కళారాణికి అందచేశారు. పార్టీ రాష్ట్ర నాయకులు బైరి శ్రీనివాస్, కందికట్ల రాజేశ్వరి మాట్లాడుతూ ప్రధాని చిత్రపటాలను ప్రతి కార్యాలయంలో ఉంచాలని, ఈ విషయంలో అధికారుల నిర్లక్ష్యం తగదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గంటా విజయశ్రీ, గుర్రం వెంకటేశ్వరరావు, కొర్రపాటి శ్రీధర్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

కాలువలకు ప్రణాళిక సిద్ధం చేయండి

● బుల్లెట్‌పై నగర కమిషనర్ తనిఖీలు



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్

నెల్లూరు(సిటీ), ఆగస్టు 6 : రామలింగాపురం అండర్‌బ్రిడ్జి వద్ద డ్రైనేజీ కాలువ నిర్మాణానికి ప్రణాళిక తయారు చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ మల్లవరపు సూర్యతేజ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం బుల్లెట్ బైక్‌పై ప్రయాణిస్తూ నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గాంధీబొమ్మ కూడలి సమీపంలోని స్వతంత్ర పార్కును సందర్శించారు. ఆ పార్కును పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. బార్కాస్‌లో సెంట్రల్ లైటింగ్ దిమ్మెను తొలగించాలని సూచించారు. పెద్దబజారు పండ్లమార్కెట్ వద్ద వ్యాపారులతో కలిసి టీ తాగుతూ పారిశుధ్యంపై పలు సూచనలు చేశారు.

రైతు ఉత్పత్తులకు జీఎస్టీ మినహాయింపు

● జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ శివప్రసాదరావు



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ శివప్రసాదరావు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 6 : రైతు ఉత్పత్తులకు జీఎస్టీ మినహాయింపు వర్తిస్తుందని జీఎస్టీ విభాగం అసిస్టెంట్ కమిషనర్ శివప్రసాదరావు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో తిక్కన భవన్‌లో నాబార్డు డీడీఎం డాక్టర్ బాబు ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తి సంఘాలపై ఒక రోజు అవగాహన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా శివప్రసాద్‌రావు మాట్లాడుతూ వాణిజ్య పన్నుల వివరాలు తెలియచేశారు. రైతు ఉత్పత్తి సంఘాలు వ్యాపారం నిర్వహించడానికి జీఎస్టీ లైసెన్సు విధిగా తీసుకోవాలన్నారు. నాబార్డు డీడీఎం డాక్టర్ బాబు మాట్లాడుతూ రైతు ఉత్పత్తి సంఘాల రకాలు, వాటిని ఏర్పరిచిన సంస్థల గురించి వివరించారు. జిల్లా సహకారశాఖాధికారి గురప్ప మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాలు రిజిస్ట్రేషన్ చేసుకొనే విధానం, రికార్డులు, డాక్యుమెంట్లు, సమావేశాలు, ఆడిట్ తదితరాలు తెలియచేశారు. జిల్లా వ్యవసాయశాఖాధికారి పీ సత్యవాణి మాట్లాడుతూ రైతు ఉత్పత్తి సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావడానికి పురుగుమందులు, విత్తనాలు, ఎరువుల వ్యాపారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి అనితకుమారి, ఉద్యానశాఖ అధికారి ప్రేమలత, ఎల్‌డీఎం శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్, జిల్లాలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలి : ఏఐఎస్‌ఎఫ్



ఆందోళన చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

నెల్లూరు (విద్య), ఆగస్టు 6 : సాంఘిక సంక్షేమ వసతి గృహాల సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ వసతి గృహాల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఏడేళ్ల నుంచి ట్రంకుపెట్టెలు, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు పూర్తిస్థాయిలో ఇవ్వలేదని ఆరోపించారు. గతేడాది నవంబరు నుంచి మెస్, కాస్మెటిక్ చార్జీలను ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. నాణ్యమైన భోజనం కూడా విద్యార్థులకు అందడం లేదన్నారు. అద్దె భవనాల్లో, చాలీచాలని వసతులతో ఇబ్బంది లు పడుతున్నారన్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి సంక్షేమ హాస్టళ్లలో వసతులు మెరుగుపరచాలని కోరారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పవన్ కిషోర్, శివం వర్మ, ప్రసాద్, అబ్దుల్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న కోటంరెడ్డి సంధ్య

నెల్లూరు(వైద్యం): నగరంలోని 14వ డివిజన్‌లో గల మల్లెల సంజీవయ్య మున్సిపల్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం టీడీపీ నాయకురాలు కోటంరెడ్డి సంధ్య పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి వసతుల గురించి తెలుసుకున్నారు. మంత్రి పొంగూరు నారాయణ సహకారంతో ఆ పాఠశాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భువనేశ్వరీప్రసాద్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మసీదు నిర్మాణం ఆపండి : బీజేపీ

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 6 : నగరంలోని 31వ డివిజన్ సుజాతమ్మకాలనీ లేఅవుట్ ప్లాట్ ఆక్రమించి అక్రమంగా మసీదు నిర్మిస్తున్నారని, దానిని ఆపాలని డీఆర్వో లవన్నకు బీజేపీ నాయకులు మిడతల రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఆ లేఅవుట్‌లో ప్రజోపయోగానికి 200 అంకణాల స్థలం కేటాయించారని, అయితే కాలనీలో ఒక్క మైనార్టీ కుటుంబం లేకపోయినప్పటికీ అక్రమంగా మసీదు నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈద్గా స్థలం కబ్జాకు ఆదాల యత్నం : ఆషిక్

కొత్తూరులోని ఈద్గా స్థలం కబ్జా చేసేందుకు మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కుట్ర పన్నాడని టీడీపీ మైనార్టీ నేత ఆషిక్ అలీఖాన్ ఆరోపించారు. మంగళవారం ఈద్గా వద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఆదాల నెల్లూరురూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నప్పుడు ఈద్గా స్థలాన్ని కాజేయాలని ప్రయత్నించారన్నారు. ఆ స్థలంలో ఆయన అల్లుడితో పెట్రోల్ బంకు ఏర్పాటు చేయించాలన్న ఉద్దేశంతో ఇదంతా చేశాడని, ఈద్గా జోలికొస్తే ఊరుకోమని హెచ్చరించారు.

ఆకట్టుకున్న విద్యార్థినుల చీరవాక్



చేనేత చీరలు ధరించిన విద్యార్థినులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జాతీయ చేనేత దినోత్సవాన్ని పురష్కరించుకొని జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో నగరంలోని బీవీనగర్‌లో ఉన్న శ్రీ చైతన్య మహిళా కళాశాలలో మంగళవారం సాయంత్రం చీరవాక్ కార్యక్రమం నిర్వహించారు. పలువురు విద్యార్థినులు చేనేత చీరలు, చేనేత బ్యాగ్‌లు ధరించి సంప్రదాయబద్ధంగా నడుస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వెన్నెల మాట్లాడుతూ అగ్గిపెట్టెలో పట్టేంత చీరలను నేసిన నైపుణ్యం, ఘనత మన చేనేత కార్మికులకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కరణం సుభాషిణి, కళాశాల ప్రిన్సిపాల్ సంయా, రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరమ్మ, గంటా విజయ్, సుజనా, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

ప్రతిబిడ్డకు తల్లి పాలు పట్టించాలి

నెల్లూరు(హరనాథపురం), జూలై 6 : పుట్టిన ప్రతిబిడ్డకు తల్లిపాలు పట్టించాలని నెల్లూరు అర్బన్ సూపర్ వైజర్ సుజాత అన్నారు. మంగళవారం నెల్లూరు అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని గాంధీనగర్-2లో తల్లిపాల వారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ నవజాత శిశువుకు తల్లిపాలే శ్రేష్టమన్నారు. తల్లీబిడ్డల శ్రేయస్సుకు తల్లిపాల వినియోగం ఎంతో అవసరమన్నారు. పుట్టిన బిడ్డకు మొదటి గంటలోనే తల్లిపాలు పట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శీనమ్మ, సుజాత, వహీద, మస్తానమ్మ పాల్గొన్నారు.

తల్లిపాల ఆవశ్యకతను తెలుసుకోవాలి



ఎనెల్ ఆసుపత్రి తల్లిపాల వారోత్సవాల్లో వైద్యులు, గర్భిణులు

నెల్లూరు(వైద్యం): తల్లిపాల ఆవశ్యకతను ప్రతి తల్లి తెలుసుకోవాలని ఎనెల్ సూపర్ స్పెషాలిటీ వైద్యులు వెల్లడించారు. మంగళవారం నగరంలోని ఎనెల్ ఆసుపత్రిలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. గర్భకోశ వ్యాధుల నిపుణులు డాక్టర్ సుగుణ, డాక్టర్ హారిక మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలను బిడ్డతో తప్పనిసరిగా తాగించాలని కోరారు. ఇవి దీర్ఘకాలిక వ్యాధుల రాకుండా రక్షణ కల్పిస్తాయని, బిడ్డకు పాలివ్వటం వల్ల తల్లి రొమ్ము కేన్సర్‌ను అధిగమించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎనెల్ ఆసుపత్రి చైర్మన్ దశరథ నాగేంద్ర ప్రసాద్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రణీత్, డాక్టర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

నెల్లూరు రూరల్: గర్భవతులు తల్లిపాలపై అవగాహన పెంచుకోవాలని మండలంలోని గొల్లకందుకూరు గ్రామ మాజీ సర్పంచు పొణక ప్రతిమ తెలిపారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి గర్భవతులకు సీమంతం చేశారు. ప్రతిమ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లిపాలే నూరేళ్ల అయుష్షునిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు శ్యామల, ఖాజాబీ, శైల పాల్గొన్నారు.



గొల్లకందుకూరులో గర్భిణులను ఆశీర్వదిస్తున్న ప్రతిమ

అభివృద్ధి, సంక్షేమం లక్ష్యం : కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, ఆగస్టు 6 : నియోజకవర్గంలో అభివృద్ధితోపాటు ప్రజలకు సంక్షేమం అందచేయడం తన తొలి లక్ష్యమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం 17, 20 డివిజన్లలో సీసీరోడ్ల పనులను ఆయన ప్రారంభించారు. ప్రజల అవసరాలు తీర్చే విధంగా అభివృద్ధి పనులు జరగాలన్నారు. రామ్మూర్తి నగర్ అభివృద్ధి కమిటీ అందరికీ ఆదర్శంగా నిలవాలని కోరారు. పార్థసారధి నగర్ విస్తరణలో ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

చేపల వ్యాపారిపై తోటి వ్యాపారుల దాడి

నెల్లూరు,(క్రైం), అగస్టు 6: వ్యాపారంలో వచ్చిన గొడవల నేపథ్యంలో చేపల వ్యాపారిపై కొందరు దాడికి పాల్పడ్డ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని బీవీనగర్‌కు చెందిన పెంచలయ్య అన్నమయ్య సర్కిల్ సమీపంలో చేపల వ్యాపారం చేస్తున్నాడు. అక్కడే చేపల వ్యాపారం చేస్తున్న గాయత్రి, రమణ తదితరులతో వ్యాపారం విషయంలో ఆయనకు విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో పెంచలయ్యతో ఈ నెల 4వ తేదీ రాత్రి గాయత్రి, రమణ, నందా, మరో ఏడుగురు కలిసి వాగ్వివాదానికి దిగారు. అనంతరం కత్తులు, కర్రతో దాడిచేశారు. గాయాలపాలైన పెంచలయ్య చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేరి అక్కడి నుంచి ప్రైవేటు వైద్యశాలకు వెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మంగళవారం దర్గామిట్ట పోలీసులు తెలిపారు.

117 జీవోను రద్దు చేయాలి

నెల్లూరు (విద్య), ఆగస్టు 6 : ప్రాథమిక విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తూ గత వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన 117 జీవోను రద్దు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బీటీఏ జిల్లా అధ్యక్షకార్యదర్శులు మణి సుబ్బు, మాసాప్రసాద్ ఓ ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయు ల కొరత ఉన్న పాఠశాలల్లో వలంటీర్లను నియమిస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తూ ఉపాధ్యాయులపై ఉన్న బోధనేతర పనిభారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.

'కేఎన్ఆర్'లో హిరోషిమా దినోత్సవం

నెల్లూరు (విద్య), ఆగస్టు 6 : నగరంలోని కేఎన్ఆర్ పాఠశాలలో 10వ ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కమాండర్ ఆదేశాల మేరకు మంగళవారం హిరోషిమా దినోత్సవం నిర్వహించారు. ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు మాట్లాడుతూ రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా దేశం జపాన్‌లోని హిరోషిమాపై అణుబాంబులను ప్రయోగించడంతో జపాన్ దెబ్బతినిందన్నారు. ఈ యుద్ధంలో లక్షలమంది పౌరులు మృతి చెందగా, అనేక మంది వికలాంగులయ్యారన్నారు. ఈ నేపథ్యంలో శాంతిని కోరుకుంటూ అమరులైన జపాన్ పౌరులకు ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ కేడెట్‌లు పాల్గొన్నారు.

నగరపాలక పాఠశాలలో రక్తదాన శిబిరం

నగరంలోని చిన్నబాలయ్యనగర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎన్‌సీసీ కేడెట్స్‌కు, విద్యార్థులకు రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి రక్తదానంపై అవగాహన కల్పించారు. రక్తదాతల కోఆర్డినేటర్ మధును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జాస్మినమ్మ, ఇన్‌చార్జి మురళీకృష్ణ, ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్ కే బాలబ్రహ్మచారి, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ వాడకంపై కేసులు

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 6: జిల్లాలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా విద్యుత్ వినియోగిస్తుండడంతో మంగళవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించిన విజిలెన్సు అధికారులు, కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. విజిలెన్సు విభాగం ఈఈలు జగదీష్, సుధాకరయ్య ఆధ్వర్యంలో కోవూరు, వెంకటాచలం, కసుమూరు, బాలాయపల్లి గ్రామాల్లో బృందాలు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించాయి. గృహాలు, దుకాణాలకు అక్రమంగా విద్యుత్ వాడుతుండటాన్ని గుర్తించి 56కేసులు నమోదు చేశారు. రూ. 2.5 లక్షల జరిమానా విధించారు. విద్యుత్తు చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నా భార్యకు వైద్యం చేయించండి

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 6 : అనారోగ్యంతో బాధపడుతున్న తన భార్యకు మానసిక వైద్యం చేయించాలని, అయితే అందుకు ఆమె అక్క కుటుంబం అడ్డుపడుతోందని నెల్లూరుకు చెందిన నీలిశెట్టి లక్ష్మణరావు అనే వ్యక్తి వాపోయారు. ఆయన నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తమకు పిల్లలు లేరని, ఈ క్రమంలో తన భార్య ఇందిర పేరున ఉన్న ఆస్తులు వేరొకరికి ఇవ్వకుండా ఉండేందుకు ఇందిరను ఆమె అక్క రాజా జయలక్ష్మి, ఆమె కుమారుడు రాజా శ్రీనివాసులు ఆత్మకూరుకు తీసుకెళ్లి వైద్యానికి దూరం చేశారని ఆరోపించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారి పరిధిలో లేదంటున్నారని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తన భార్యకు వైద్యం చేయించాలని కోరారు.

14 నుంచి ఈశా ఫౌండేషన్ తరగతులు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 6 : ఈశా ఫౌండేషన్ ఇన్నర్ ఇంజనీరింగ్ కార్యక్రమాలు ఈనెల 14 నుంచి 20వతేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాలు తిరుపతి, అనంతపురం, రాజమహేంద్రవరం, నెల్లూరులో జరుగుతాయన్నారు. ఆసక్తి కలిగినవారు 040- 41896666 నెంబరులో సంప్రదించాలని కోరారు.

స్విమ్స్ డైరెక్టర్ ఎవరు?



టీటీడీ నిర్వహణలో ఉన్న శ్రీవేంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ (స్విమ్స్) డైరెక్టర్‌గా ఎవరు రాబోతున్నారు అనే చర్చ వైద్య వర్గాల్లో జోరుగా సాగుతోంది. ప్రస్తుత డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ పదవీకాలం రెండేళ్లపాటు ఉన్నప్పటికీ ప్రభుత్వం మారడంతో ఈయన స్థానంలో కొత్తవారికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. రాజకీయ నాయకులతో సఖ్యతగా ఉండే రవికుమార్, టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు ప్రభుత్వం మారగానే మొదలు పెట్టారని అంటున్నారు. నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో కార్డియోథొరాసిక్ సర్జన్‌గా పనిచేస్తున్న ఆర్వీ కుమార్‌ను వైసీపీ ప్రభుత్వంలో స్విమ్స్ డీమ్డ్ వర్సిటీ వైస్ చాన్సలర్ కమ్ డైరెక్టర్‌గా ప్రతిష్ఠాత్మకమైన బాధ్యతలు అప్పగించారు. స్విమ్స్‌లో ఉన్న సీనియర్లను పట్టించుకోకుండా ఈయన్ను తీసుకురావడంపై అప్పట్లో వైద్యవర్గాల్లో చర్చ జరిగింది కూడా. అయితే వైసీపీ నాయకులకు ఆగమేఘాల మీద వైద్య సేవలు ఇంటికే అందిస్తూ ఈయన వారి మెప్పు పొందారు. నిజానికి గుండె వైద్య నిపుణుడిగా స్విమ్స్‌లో పేరున్న సీనియర్ డాక్టర్ రాజశేఖర్‌కు వెంగమ్మ తర్వాత డైరెక్టర్ పదవి లభిస్తుందని అందరూ భావించారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి బాగా సన్నిహితుడిగా కూడా పేరున్నందున ఈయనకు పదవి లభిస్తుందని అనుకున్నా అప్పటి సీఎం జగన్ పేషీ నుంచి రవికుమార్ పేరు అనూహ్యంగా తెరమీదకు వచ్చింది. ఇప్పుడు మళ్లీ డాక్టర్ రాజశేఖర్ పేరు వినిపిస్తోంది. బర్డ్ మాజీ డైరెక్టర్ డాక్టర్ జగదీష్ పేరు కూడా బలంగానే వినిపిస్తోంది. అయితే ఆయన వయసు రీత్యా సాధ్యం కాదేమో అనే అనుమానాలూ ఉన్నాయి. మరోవైపు మాజీ డైరెక్టర్ వెంగమ్మ పేరు కూడా ప్రస్తావనకు వస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో అత్యంత అవమానకర రీతిలో ఆమెను పంపేసినందున కూటమి ప్రభుత్వం ఆమె పేరును సానుకూలంగా పరిశీలించవచ్చని కొందరు అంటున్నారు.

ఐఏఎస్‌ను నియమిస్తారా?

ఇలా వుంటే స్విమ్స్, బర్డ్, ఆయుర్వేద ఆస్పత్రులను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి.. ఒక డైరెక్టర్‌ను ఏర్పాటుచేయాలన్న ప్రతిపాదన ఎప్పటినుంచో ఉంది. ఒకవేళ ఈ అంశం తెరపైకి వస్తే ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించే అవకాశాలూ లేకపోలేదు. ఏదిఏమైనా టీటీడీ పాలకమండలి నియామకం జరిగిన తర్వాతే స్విమ్స్ డైరెక్టర్ మార్పులు జరిగే అవకాశం ఉంటుందని అంటున్నారు. రాయలసీమకే తలమానికం అయిన స్విమ్స్ సారథ్య బాధ్యతలను రాజకీయ కోణంలోంచి చూసి కాకుండా ప్రతిభావంతులకు అప్పగిస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. పేదలకూ మంచి వైద్యం అందుతుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అర్ధరాత్రి దీపాల పేరుతో మోసాలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 6: ముక్కంటి ఆలయ పరిసరాల్లో అర్ధరాత్రి వేళ కొందరు దళారీలు దీపాల పేరుతో భక్తులను భారీగా మోసం చేస్తున్నారు. ఆలయం పరిసరాల్లోని 1వ గేటు, 2వ గేటు సమీపంలో భక్తులు రాత్రి వేళ నిద్రిస్తుంటారు. ఉదయం వీరికి కొందరు దీపాలు వెలిగిస్తే దోషం పోతుందంటూ నమ్మిస్తారు. అలా నకిలీ నేతి దీపాలను భక్తులకు అంటగడుతూ చాలా ఏళ్లగా దందాలు సాగిస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ఉదయం వేళ భక్తులను మోసగించే ప్రక్రియకు స్వస్తి పలికారు. అయితే గుట్టు చప్పుడు కాకుండా అర్ధరాత్రి పాపాల దీపాలను విక్రయిస్తున్నారు. రాత్రి ఒంటి గంట నుంచి 1వ గేటు, 2వ గేటు సమీపంలోని భక్తులను కొందరు దళారీలు హడావుడిగా నిద్ర లేపేస్తున్నారు. అక్కడికి సమీపంలోని కాశీ విశ్వనాథస్వామి సన్నిధి, వీరభద్రస్వామి సన్నిధి, వాయుమూల గణపతి వద్ద ప్రతి ఒక్క భక్తుడూ వేర్వేరుగా మూడు దీపాలు వెలిగించాలంటూ నమ్మిస్తున్నారు. ఒక్కో దీపానికి రూ.500 చొప్పున ఒక్కో భక్తుడి నుంచి రూ.1,500 వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. భక్తులను మోసగించే ఈ తరహా దొంగలు ఉదయం ఐదు గంటల్లోగా ఈ దందాను ముగిస్తున్నారు. అర్ధరాత్రి ఆలయంలో దోషం పేరుతో ఇలా భక్తులను దోపిడీ చేయడం సామాజిక మాధ్యమాల్లోనూ వైరల్‌గా మారింది.



అర్ధరాత్రి భక్తులు వెలిగించిన దీపాలు

తిరుమలలో భారీ వర్షం

తిరుమల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం రాత్రి 10 నుంచి 11.30 గంటల వరకు భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ ఎక్కువగా ఉన్నప్పటికీ మధ్యాహ్నం 12.30 గంటల నుంచి నల్లటి మేఘాలు తిరుమలను కప్పేయడం మొదలుపెట్టాయి. మూడు గంటల సమయంలో మొదలైన వాన గంటపాటు జోరుగా కురిసింది. ఆతర్వాత చిరుజల్లులు రాత్రి వరకు కొనసాగాయి. రాత్రి పది నుంచి గంటన్నరపాటు భారీ వాన కురవడంతో శ్రీవారి ఆలయ ప్రాంతంతోపాటు, మాడవీధులు, కాటేజీలు, పార్కులు, రోడ్డు తడిచిముద్దయ్యాయి. ఎత్తుప్రదేశాల నుంచి వర్షం జోరుగా ప్రవహించింది. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులు ఇబ్బందిపడ్డారు. ఘాట్లలో వాహనదారులూ ఇబ్బంది పడాల్సి వచ్చింది.



చిన్నారుల అవస్థ







చేపల మార్కెట్ వద్ద..

నిమ్మకాయల వీధిలో..

తిరుపతిలో కుండపోత

తిరుపతి అర్బన్, ఆగస్టు 6: తిరుపతిలో మంగళవారం కుండపోత వర్షం కురిసింది. పగలంతా అధిక ఉష్ణోగ్రతలు నమోదైనా సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై దాదాపు అరగంటపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. రోడ్లన్నీ చెరువులను తలపించాయి. కాలువల్లోని మురుగు కూడా కలవడంతో జనం తీవ్ర ఇబ్బంది పడ్డారు. విద్యార్థులు ఇళ్లకే వెళ్లే సమయం కావడంతో తడిచి ముద్దయ్యారు.



సూళ్లూరుపేట జీఎన్‌టీ రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

సూళ్లూరు పేట, తడలో వీధులన్నీ జలమయం

సూళ్లూరుపేట/తడ, ఆగస్టు 6: సూళ్లూరుపేట, తడలోనూ మంగళవారం భారీ వర్షం కురిసింది. వీధులన్నీ జలమయం అయ్యాయి.



వర్షం కారణంగా శ్రీవారి ఆలయం ముందు ఇబ్బంది పడుతున్న భక్తులు



గోవిందా.. గోవిందా..!

తిరుమలలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి శ్రీవారి ఆలయం ముందు కొంత ప్రదేశం వరకు నెయ్యితో కూడిన మురుగు పొంగింది. దర్శనానంతరం ఆలయం బయటకు వచ్చేవారు, ప్రసాదాలు తీసుకొచ్చే భక్తులు దీనిపై కాలు వేయడంతో జారిపడి గాయపడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



చంద్రగిరిలో ఇసుక రీచ్‌ల కోసం పరిశీలన

చంద్రగిరి, ఆగస్టు 6: చంద్రగిరి మండలంలో ఇసుక రీచ్‌ల కోసం రెవెన్యూ, ఎంపీడీవో, మైనింగ్, ఎస్‌ఈబీ, ఆర్‌డబ్ల్యూ అధికారులు మంగళవారం స్వర్ణముఖి నదిని పరిశీలించారు. మండలంలోని శానంబట్ల, నాగయ్యగారిపల్లె వద్ద ఇసుక రీచ్‌లు ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై వివరాలను సేకరించారు. శానంబట్ల వద్ద రీచ్ ఏర్పాటు చేయడానికి అనువుగా లేదని గుర్తించినట్లు తెలిసింది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపనున్నట్లు సమాచారం. ఈకార్యక్రమంలో మైన్స్ ఏడీ ప్రకాష్‌కుమార్, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీవో వెంకటసూర్యసాయి, ఎస్‌ఈబీ సీఐ శ్రీహరిరెడ్డి, ఎంవీఐ మోహన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



శానంబట్ల వద్ద స్వర్ణముఖినదిలో ఇసుక రీచ్ కోసం పరిశీలిస్తున్న అధికారులు

కోర్టు కానిస్టేబుళ్లకు త్వరలో శిక్షణ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 6: కొన్ని నేరాల్లో నేరస్తులకు శిక్ష పడేలా ఎలా పనిచేయాలి? దర్యాప్తు అధికారుల సహాయ సహకారాలు ఎలా తీసుకోవాలి? ఏపీపీలతో ఎలా వ్యవహరించాలి? అనే విషయాలపై కోర్టు కానిస్టేబుళ్లకు పోలీస్ శాఖ ఉన్నతాధికారులు త్వరలో అవగాహన కల్పించనున్నారు. ఈ విషయంలో న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అనుభవజ్ఞులైన అధికారులు, న్యాయ కోవిదులతో శిక్షణ ఇప్పించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటి వరకు ఎన్ని కేసుల్లో శిక్ష పడింది..? ప్రధానంగా పోక్సో కేసుల్లో దర్యాప్తు ఎలా చేయాలి? అనే అంశాలపై సమగ్రంగా శిక్షణ ఇప్పించనున్నారు. దీనికోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

చిరుత పులా.. రేసు కుక్కలా?

- అడవి జంతువు దాడిలో దూడ మృతి
- పాదముద్రలు సేకరించిన అటవీ అధికారులు





పాదముద్రలను సేకరిస్తున్న అటవీ అధికారులు (ఇన్‌సెట్‌లో) దూడ కళేబరం

రామచంద్రాపురం, ఆగస్టు 6: అడవి జంతువు ఓ దూడను చంపి తిన్న సంఘటన రామచంద్రాపురం మండలం పరమాల అటవీ ప్రాంత సమీపంలోని పొలాల వద్ద సోమవారం రాత్రి జరిగింది. పరమాలకు చెందిన శేషమ్మ సోమవారం సాయంత్రం అటవీ ప్రాంత సమీపంలోని తమ పొలం వద్ద రెండు ఆవులతోపాటు ఓ దూడను కట్టి ఇంటికి వచ్చింది. మంగళవారం ఉదయం ఆవు పాలు తీయడానికి పొలం వద్దకు వెళ్లగా.. దూడను గుర్తు తెలియని అడవి జంతువు చంపి సగం తిన్నట్లు గుర్తించింది. గ్రామస్తులకు తెలపగా వారు అటవీశాఖ అధికారి కిషోర్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అడవి జంతువు పాదముద్రలు సేకరించి ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఆ నివేదిక వస్తే గానీ ఏ జంతువు దూడను చంపిందో గుర్తించలేమన్నారు. ఎన్నో ఏళ్లుగా తమ పొలాల వద్ద పశువులను కట్టేస్తున్నప్పటికీ ఇలాంటి ఘటన ఇంతకు మునుపు జరగకపోవడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. దూడను చంపింది చిరుత పులా, రేసు కుక్కలా అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

విద్యుత్ వాహనాలకే ప్రాధాన్యం

- శ్రీవారి భక్తులకు సురక్షిత ప్రయాణం అందించడమే లక్ష్యంగా పనిచేయండి
- ఆర్టీసీ అధికారులతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



నూతన బస్సును ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

తిరుమల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాబోయే కాలంలో విద్యుత్ వాహనాలకే ప్రాధాన్యం ఉంటుందని రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శ్రీవారి దర్శనానంతరం తిరుమలలోని ఆర్టీసీ బస్టాండ్‌ను జిల్లా ప్రజా రవాణాధికారి చెంగల్‌రెడ్డి, డీఎం విశ్వనాథ్‌తో కలిసి పరిశీలించారు. ముందుగా డీఎం కార్యాలయానికి వెళ్లి అధికారులు, ఉద్యోగులతో మాట్లాడారు. శ్రీవారి భక్తులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు. బస్టాండును పరిశుభ్రంగా ఉంచుకోవాలని, భక్తులతో మర్యాదపూర్వంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతమున్న బస్టాండు సరిపోతుందా అని ప్రశ్నించగా, విద్యుత్ బస్సుల కోసం ఓ ప్రదేశాన్ని ఇవ్వాలని టీటీడీని కోరామని, త్వరలోనే వారు అందజేస్తారని అధికారులు వివరించారు. ఈక్రమంలో కొందరు ఉద్యోగులు ప్రమోషన్లపై ప్రస్తావించగా, మంత్రి పరిశీలిస్తామన్నారు. తర్వాత ఓ విద్యుత్ బస్సులోకి వెళ్లి భక్తులతో ముచ్చటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. వచ్చే ఐదేళ్లలో ఆర్టీసీకి బస్సు కొనాల్సి వచ్చే విద్యుత్ బస్సునే కొనేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోనున్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించేనాటికి ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గత ప్రభుత్వం చాలా రూట్లను మూసివేసిందని, నూతన బస్సుల కొనుగోళ్లలోనూ లోపాలను గుర్తించినట్లు చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం మాత్రం ఆర్టీసీ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. తిరుమల, తిరుపతి మధ్య రోజూ 300 ట్రిప్పుల ద్వారా 90వేల మంది భక్తులు రాకపోకలు సాగించడం గొప్పవిషయమన్నారు.

రెండు నూతన బస్సులను ప్రారంభించిన మంత్రి

తిరుపతి(ఆర్టీసీ): వెంకటగిరి డిపోకు చెందిన రెండు నూతన బస్సులను అలిపిరి డిపోలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. వెంకటగిరిలో ఈ సర్వీసు ప్రతి రోజూ ఉదయం 8.15గంటలకు బయల్దేరి తిరుపతికి 9.30గంటలకు చేరుకుంటుంది. 10.15గంటలకు తిరుపతి నుంచి బయల్దేరి రాత్రి 7.40 గంటలకు విజయవాడకు చేరుకుంటుంది. మరుసటి రోజున ఉదయం ఆరు గంటలకు విజయవాడలో బయల్దేరి మధ్యాహ్నం 3.45గంటలకు తిరుపతికి చేరుకుని సాయంత్రం 5.15గంటలకు వెంకటగిరికి చేరుకుంటుంది. ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సీఎంఈ నరసింహులు, సీటీఎం భాస్కర్‌రెడ్డి, డీఎంలు విశ్వనాథం, బాలాజీ, రామకృష్ణ, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు. కాగా, తొలుత మంత్రి అలిపిరి డిపో ఆవరణంలో మొక్క నాటారు.



విద్యుత్ బస్సులోని భక్తులతో మాట్లాడుతున్న మంత్రి

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోండి

గూడూరు, ఆగస్టు 6: విద్యార్థి దశనుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సెయింట్ మేరీస్ కళాశాల ప్రిన్సిపాల్ సిసిలియా అన్నారు. మంగళవారం జూనియర్ కళాశాలలో కళాశాల ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువను తెలియజెప్పేలా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని సమర్థవంతంగా నడుచుకోవాలన్నారు. సార్వత్రిక ఎన్నికల తరహాలో బ్యాలెట్ పేపర్ల ద్వారా ఎన్నికలు నిర్వహించి ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్లను విద్యార్థినులు ఎన్నుకున్నారన్నారు. అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరుకు చేరిన టీడీపీ కార్యకర్త సైకిల్‌యాత్ర


రామచంద్రమురళితో టీడీపీ నాయకులు

గూడూరు, ఆగస్టు 6: ధర్మం గెలిచింది అనే నినాదంతో చిత్తూరు నుంచి విజయ వాడకు సైకిల్ యాత్ర చేపట్టిన టీడీపీ కార్యకర్త రామచంద్ర మురళి మంగళవారం గూడూరుకు చేరుకున్నారు. ఇక్కడి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ... సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో చిత్తూరుకు చెందిన టీడీపీ కార్యకర్త రామచంద్ర విజయవాడ వరకు సైకిల్ యాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం రామచంద్రను సన్మానించారు. కార్యక్రమంలో వి.సునీల్, శివకుమార్, శివప్రసాద్, సాయిలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సుందరమ్మకు పూజలు

చిల్లకూరు, ఆగస్టు 6: స్థానిక దళితవాడలోని సుందరమ్మ అమ్మవారికి మంగళవారం ప్రత్యేకపూజలు జరిగాయి. ఈనెల 9, 10, 11 తేదీల్లో నిర్వహించనున్న తిరునాళ్ల నేపథ్యంలో మూడో మంగళవారం అమ్మవారికి అంబలి పోసే కార్యక్రమం నిర్వహించారు. మహిళలు సామూహికంగా అంబలి తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పర్యావరణ పరిరక్షణకు చెట్లను పరిరక్షిద్దాం


మొక్కలను అందిస్తున్న టీడీపీ నేతలు

చిల్లకూరు, ఆగస్టు 6: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అందుకోసం ప్రతి ఒక్కరు విరివిగా మొక్కలను నాటి పరిరక్షించాలని టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ అన్నారు. మంగళవారం పట్టణంలోని దర్గా సమీపంలో పెళ్లకూరుకు చెందిన చాగణం లలితమ్మ, భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానికులకు మామిడి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నానాజీ మాట్లాడుతూ... మండలంలో ప్రతి ఇంటికి మామిడి మొక్కను అందించేందుకు ట్రస్ట్ చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ చాగణం గౌరీశంకర్, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కె.రామచంద్రారెడ్డి, పి.జానకిరామిరెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు, సీతారామనాయుడు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలి

ఎమ్మెల్యే విజయశ్రీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నాయుడుపేట టౌన్, ఆగస్టు 6: అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ ... తల్లిపాలు బిడ్డలకు శ్రేయస్కరమన్నారు. నియోజకవర్గంలో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు బాధ్యతగా పనిచేయడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. ఇటీవల తనిఖీలు కూడా చేశామన్నారు. నియోజకవర్గ పరిధిలోని సెజ్‌లో ఉన్న పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడి సీఎస్ఆర్ నిధులతో మారుమూల ప్రాంతాల్లో ఉన్న అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని కేర్‌పాలెం సమీపంలో ఉన్న నంద ఫంక్షన్ హాల్‌లో సూళ్లూరుపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో శారదాంబ ఆధ్వర్యంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో ఎమ్మెల్యే విజయశ్రీ పాల్గొన్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి టి.సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రమేష్, ఏజీ కిషోర్, నాయకులు శ్రీనివాసులు, మాధవనాయుడు, మెస్ రమణయ్య, కె.మురళి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం తనిఖీ

డక్కిలి, ఆగస్టు 6: పట్టణంలోని ఆధార్ కేంద్రాన్ని బుధవారం డివిజన్ పంచాయతీ విస్తరణ అధికారి వాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆధార్ నమోదుపై సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆధార్ సెంటర్‌ను నెలలో ఒక్కో సచివాలయానికి మార్చి ఆయా ప్రాంతాల్లో నూరుశాతం నమోదయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయితీ కార్యదర్శి, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

అదుపుతప్పి కాంక్రీట్ మిక్చర్ లారీ బోల్తా



నాయుడుపేట టౌన్, ఆగస్టు 6: మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో అదుపుతప్పి కాంక్రీట్ మిక్చర్ లారీ బోల్తా పడింది. మంగళవారం మేనకూరు నుంచి పండ్లూరుకు బయలుదేరిన లారీ మార్గమధ్యంలోని షుగర్ ఫ్యాక్టరీ సమీపంలోకి రాగానే అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ సంఘటనలో ఎవరూ గాయపడలేదు.

దళితులపై వివక్ష తగదు


మీడియాతో మాట్లాడుతున్న మునెయ్య

డక్కిలి, ఆగస్టు 6: దళితుల పట్ల కొంతమంది అధికారులు వివక్ష చూపుతున్నారని ఇది సరికాదని ఏపీ ప్రజాసంఘాల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు జి.మునెయ్య అన్నారు. బుధవారం ఆయన డక్కిలి పట్టణంలో మీడియాతో మాట్లాడుతూ... నియోజకవర్గంలో దళిత, గిరిజనుల పట్ల ఇటీవల కొంత మంది అధికారులు చాలా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. డక్కిలి బాలయోగి బాలకల గురుకుల పాఠశాలలో ఇటీవల ఓ దళిత విద్యార్థి పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంతో చనిపోతే ఇంత వరకు ఆ కుటుంబానికి ప్రభుత్వం నుంచి సాయం అందలేదన్నారు. సైదాపురం మండలంలో వీరరాఘవయ్య అనే దళితుడు వైద్యశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మృతి చెందితే, ఈ సంఘటనపై జిల్లాస్థాయి అధికారులు నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. ఇదే ప్రాంతానికి చెందిన రాకేష్ అనే విద్యార్థి అగ్రకుల, పోలీసుల అనాలోచిత చర్యలతో మృతి చెందితే ఇప్పటివరకు చర్యల్లేవన్నారు. దళిత, గిరిజనుల పట్ల వివక్ష విడనాడక పోతే దళిత, గిరిజనులు ఏకమై ఉద్యమిస్తామని హెచ్చరించారు.

త్వరలో మందకృష్ణ మాదిగ విజయోత్సవ సభ

డక్కిలి, ఆగస్టు 6: పట్టణంలో త్వరలో మందకృష్ణ మాదిగ విజయోత్సవ సభ నిర్వహించనున్నట్లు జిల్లా మాదిగ ఉద్యోగ సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి డి.పెంచలయ్య అన్నారు. బుధవారం డక్కిలిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మంద కృష్ణమాదిగ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకణకు సుప్రీంకోర్టు సానుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. ఈ సభకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ఎస్.రత్నయ్య, ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు జి.మునెయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు కె.వెంకటసుబ్బయ్య, జి.చెంచుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం... విద్యుత్ సరఫరాకు అంతరాయం

సూళ్లూరుపేట, ఆగస్టు 6: సూళ్లూరుపేటలో కురిసిన భారీ వర్షానికి పట్టణంలో వీధులన్నీ జలమయమయ్యాయి. మంగళవారం ఉదయం నుంచి ఎండ కాయగా మధ్యాహ్నం వాతావరణం ఒక్కసారిగా మారి కారుమబ్బులు కమ్ముకున్నాయి. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు పట్టణంలో పలుచోట్ల చెట్టుకొమ్మలు, ఫ్లెక్సీలు విద్యుత్ లైన్లపై కూలడంతో తీగలు తెగి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సుమారు నాలుగు గంటల పైగా విద్యుత్‌కు అంతరాయం కలిగింది. ట్రాన్స్‌కో సిబ్బంది వెంటనే స్పందించి ఫ్లెక్సీలు, చెట్లను తొలిగించి సరఫరాను పునరుద్ధరించారు. భారీ వర్షం కురవడంతో జీఎన్‌టీ రోడ్డుపై వర్షపు నీరు నిలబడడంతో గుంతల రోడ్డులో వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు.

తడలో...

తడ: పట్టణంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మోస్తరు ఎండ కాయగా మధ్యాహ్నం తరువాత ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. నల్లటి కారుమబ్బులు కమ్ముకున్నాయి. ఉన్నట్టుండి ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో జాతీయ రహదారి తోపాటు సర్వీస్‌రోడ్లపై నీరు నిలిచిపోయింది. పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.


సూళ్లూరుపేట పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డుపై వర్షపు నీరు - గూడూరులో కురుస్తున్న వర్షం

గూడూరులో మోస్తరు వర్షం

గూడూరు అర్బన్: పట్టణంలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఉరుములు, ఈదురుగాలులతో గంటకుపైగా వర్షం కురిసింది. ఆసుపత్రిరోడ్డు, ఐసీఎస్‌రోడ్డు, కోనేటిమిట్ట, శాంతినగర్, త్యాగరాజవీధి తదితర ప్రాంతాల్లో వాననీరు రోడ్లపై ప్రవహించడంతో పాదచారులు, ద్విచక్రవాహనదారులు ఇబ్బంది పడ్డారు. మూడు రోజులుగా ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం కొంత ఊరటనిచ్చింది.

వైసీపీ నాయకుల చెర నుంచి భూములకు విముక్తి: పాశం

కోట, ఆగస్టు 6: వైసీపీ నాయకుల కబ్జాచేసిన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని భూమిలేని పేదలకు పంచిపెడతామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చెప్పారు. కోట మండలం మద్దాలిలో రూ.29 లక్షలతో నిర్మించిన తాగునీటి పథకాన్ని మంగళవారం పాశం ప్రారంభించారు. అనంతరం జీపుపై ర్యాలీగా వెళ్లి మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు తయారుచేసిన పలు నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ... మండలం వైసీపీ నాయకుల భూ కబ్జాకు చిరునామాగా నిలిచిందన్నారు. కేశవరం పంచాయతీలో వైసీపీ నాయకులు కబ్జాచేసిన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని భూమిలేని పేదలకు పంచిపెడుతామన్నారు. అదే విధంగా మద్దాలిలో నిషేదంలో ఉన్న ప్రభుత్వ భూములకు మోక్షం కలిగించి స్థానిక ఎస్సీ, బీసీ, మైనార్టీలకు పంచుతామన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని నేరవేరుస్తామన్నారు. వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని కలసికట్టుగా తిప్పికొడతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.సర్వత్తమరెడ్డి, పార్టీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, దశరథరామిరెడ్డి, ఎన్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎన్.మోహన్‌రెడ్డి, చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వాహనంనుంచి మాట్లాడుతున్న పాశం సునీల్ కుమార్

ప్రేమ వ్యవహారంలో ఇరువర్గాల ఘర్షణ

బాలిక అన్న, మేనమామకు కత్తిపోట్లు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 6: ప్రేమ వ్యవహారంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. బాలిక అన్న, మేనమామ కత్తిపోట్లకు గురయ్యారు. తిరుపతి ఈస్ట్ డీఎస్పీ రవిమనోహరాచారి తెలిపిన వివరాల మేరకు.. స్థానిక రైల్వేకాలనీ సమీపంలోని సుందరయ్యనగర్‌లో నివాసముంటున్న బాలు అదే ప్రాంతంలోని ఓ బాలికను ప్రేమించడం మొదలుపెట్టాడు. తరచూ ఆ బాలికతో మాట్లాడటం చూసిన ఆమె పెద్దలు పలుమార్లు మందలించారు. దీనిపై గతంలో ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పట్లో పోలీసులు ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చి పంపారు. రెండ్రోజుల కిందట సుందరయ్యనగర్‌లో జాతర జరిగింది. ఈ సందర్భంగా బాలు మళ్లీ బాలిక వెంటపడటం మొదలుపెట్టాడు. మంగళవారం ఆమె అన్న లోకేష్ దీన్ని తట్టుకోలేక బాలు కుటుంబీకులతో గొడవపడ్డాడు. మాటామాటా పెరిగి రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. రాళ్లు, కర్రలతో కొట్టుకున్నారు. లోకేష్‌తోపాటు అతడి మేనమామ సురేష్‌పై బాలు వర్గీయులు కత్తితో దాడి చేశారు. లోకేష్‌కు కాలుపై, సురేష్‌కు కడుపు, కాలుపై కత్తిపోట్లు పడ్డాయి. బాధితులను పోలీసులు చికిత్స నిమిత్తం రుయాస్పత్రిలో చేర్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఈస్ట్ ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కత్తిపోట్లకు గురైన లోకేష్ - సురేష్‌ను విచారిస్తున్న పోలీసులు

ప్రభుత్వ భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి: సీపీఎం

నాయుడుపేట, ఆగస్టు 6: ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకుడు శివకవి ముకుంద డిమాండ్ చేశారు. నాయుడుపేట తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం తహసీల్దారు గీతావాణికి ఈ మేరకు సీపీఎం అనుబంధ సంఘాల నాయకులతో కలసి వినతిపత్రం అందజేశారు. నాయుడుపేట మండలం పండ్లూరు పంచాయతీలోని సర్వే నెం.87, 89, 90లో ప్రభుత్వ భూమిని హైదరాబాదుకు చెందిన పారిశ్రామికవేత్తలు ఆక్రమించి అందులో ఫ్లైయాష్ బ్రిక్స్ తయరీ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఆ భూమిని భూములు లేని పేదలకు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోజ్, వరప్రసాద్, వంశీ, రమణయ్య తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో నిషాన్



గూడూరు అర్బన్, ఆగస్టు 6: స్థానిక హజరత్ సయ్యద్ జాఫర్ మస్తాన్ ఔలియా దర్గా వద్ద మంగళవారం దర్గా కమిటీ ఆధ్వర్యంలో నిషాన్ జెండా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ... గంధంమహోత్సవంలో భాగంగా నెలవంకను చూసిన వెంటనే నిషాన్ జెండా నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. ఈనెల 24న గంధం మహోత్సవం జరుగుతుందన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో రియాజ్‌అహ్మద్, మగ్దూం, మస్తాన్, ఖమర్‌అలీ, షాన్‌వాజ్, షబ్బీర్, యస్థానీ, సందానీ తదిరులు పాల్గొన్నారు.

భ్రూణ హత్యలను నివారించండి: ఆర్డీవో

సూళ్లూరుపేట, ఆగస్టు 6: లింగనిర్ధారణ చట్టాలను పటిష్ఠంగా అమలు చేసి భ్రూణ హత్యలను నివారించాలని ఆర్డీవో చంద్రముని ఆదేశించారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో లింగ నిర్ధారణ చట్టం అమలుపై ఆర్డీవో ఆధ్వర్యంలో జిల్లా జిల్లాస్థాయి అడ్వైజర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఆడ, మగ పిల్లలిద్దరూ సమానమేనని ఆడబిడ్డల పట్ల వివక్ష ఉండకూడదన్నారు. జిల్లాలో అన్ని స్కానింగ్ సెంటర్లను సంబంధిత అధికారులు తనిఖీచేయాలన్నారు. డిప్యూటీ ఈఎంహెచ్‌వో శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో ద్వితీయ స్థానం

నాయుడుపేట, ఆగస్టు 6: తైక్వాండ్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లా క్రీడాకారులు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు కోచ్ పవన్ తెలిపారు. అనంతపురం జిల్లా తాడిపర్తిలో మూడు రోజులపాటు జరిగిన పోటీల్లో ఉమ్మడి విజయనగరం జిల్లా చాంపియన్‌షిప్ సాధించిందన్నారు. నెల్లూరు జిల్లా ద్వితీయం స్థానంలో నిలవగా, కృష్ణా జిల్లా తృతీయస్థానంలో నిలిచిందన్నారు. పోటీలో నెల్లూరు జిల్లా నుంచి 40 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఏపీ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అచ్యుతరెడ్డి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ చేతులమీదుగా కప్పును అందుకున్నట్టు తెలిపారు. బి.శ్రీనివాసులు, పవన్ కుమార్, సాయి, లీలాకుమారి, వినోద్‌కుమార్, అష్రఫ్ పాల్గొన్నారు.

చిట్టేడులో ఆశా డే

కోట, ఆగస్టు 6: మండలంలోని చిట్టేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి నాగరాజు ఆధ్వర్యంలో కుష్ఠు నివారణ చర్యలపై అవగాహన ర్యాలీ జరిగింది. అదే విధంగా తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. పెంచలయ్య, ఎలిజిబెత్ రాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చిల్లకూరు, ఆగస్టు 6: మండలంలోని కడివేడు గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. కడివేడుకు చెందిన శ్రీధర్‌రెడ్డి బైక్‌పై గూడూరుకు వచ్చి తిరిగి వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనింది. దీంతో శ్రీధర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

తల్లిపాల వారోత్సవాలు

గూడూరు అర్బన్, ఆగస్టు 6: పట్టణంలోని కోనేటిమిట్ట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మెహబూబీ మాట్లాడుతూ... పుట్టిన బిడ్డకు తల్లిపాలను ఇవ్వడం ద్వారా బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు.

ఫిర్యాదుల స్వీకరణ కోసం కాల్ సెంటర్

తడ, ఆగస్టు 6: గ్రామాల్లో సమస్యల ఫిర్యాదు కోసం కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని ఎంపీడీవో విజయకుమార్ తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మండల కేంద్రంలో ఫిర్యాదుల కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.మంగళవారం నుంచి ప్రజలకు అందుబాటులో కాల్ సెంటర్ అందుబాటులో ఉంటుందన్నారు. ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు ఎళ్లవేళలా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలు తమ ఫిర్యాదులను కాల్‌సెంటర్ ఫోన్ నెం.8838410059కు కానీ, వాట్సాప్ నెం.9573836731కు ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

సూళ్లూరుపేట, ఆగస్టు 6: పట్టణంలోని అలవల రోటరీ కంటి వైద్యశాలలో మంగళవారం సూళ్లూరుపేట రాజస్థాన్ సేవా సంఘం, చెన్నై నగరానికి చెందిన మెట్రో మహావీర్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్వీ అరవింద్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం జరిగింది. ఈ శిబిరంలో 196 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 109 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సోహన్ రాజ్‌బందారి, సురేంద్రకుమార్, ప్రదీఫ్‌కుమార్, నరేంద్రజైన్, భగవాన్ రావు, బాలాజి, బద్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వెట్ గ్రైండర్ వితరణ

నాయుడుపేట టౌన్, ఆగస్టు 6 : నాయుడుపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వంటశాల కోసం అదే పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ మంగళవారం వెట్ గ్రైండర్‌ను అందజేశారు.

ఎమ్మెల్యే విజయశ్రీకి సన్మానం

నాయుడుపేట టౌన్, ఆగస్టు 6: సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని ఆర్య వైశ్య సంఘ తిరుపతి రూరల్ జిల్లా అధ్యక్షుడు జి.కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో సన్మానించారు. నాయుడుపేటలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేని శాలువాతో సత్కరించి శ్రీవారి ప్రసాదాలను అందజేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం టీడీపీకి ఆర్యవైశ్యులు అండగా ఉంటారని కిషోర్ తెలిపారు. కిషోర్ వెంట కిరణ్ ఉన్నారు.

వ్యక్తిగత కారణాలతో బాధ్యతలు స్వీకరించని తహసీల్దార్

పెళ్లకూరు, ఆగస్టు 6: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాలకు బదిలీ అయి తిరిగి జిల్లాకు వచ్చిన తహసీల్దార్లలో పెళ్లకూరు మండలానికి తహసీల్దార్‌గా అనురాధను నియమించారు. ఇప్పటికే అన్ని మండలాల తహసీల్దార్లు బాధ్యతలు చేపట్టగా పెళ్లకూరు తహసీల్దార్ మాత్రం ఇంకా స్వీకరించలేదు. ఈ క్రమంలో ఆంధ్రజ్యోతి- ఆమెతో మాట్లాడగా తన వ్యక్తిగత కారణాల వల్ల పెళ్లకూరు మండల తహసీల్దార్ బాధ్యతలు చేపట్టలేదన్నారు. తనకు ఏడు నెలలు సర్వీసు మాత్రమే ఉందన్నారు. తాను నెల్లూరులో నివాసం ఉన్నానని, పెళ్లకూరు ఎక్కువ దూరం కావడంతోనే ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానన్నారు.

'మండల పరిషత్ కార్యాలయంలో వైసీపీ నాయకుల దందా'

వాకాడు, ఆగస్టు 6 : మండల పరిషత్ కార్యాలయంలో వైసీపీ నాయకులు సమావేశాలు ఏర్పాటు చేస్తూ అధికారులను భయాందోళనలకు గురిచేస్తున్నారని తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి కె.దయాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్లపాటు అధికారంలో ఉన్న వైసీపీ నాయకులు అధికార యంత్రాంగాన్ని భయాందోళనలకు గురి చేసి భూ ఆక్రమణలకు పాల్పడ్డారన్నారు. ఇసుక, మట్టి దోచుకున్నారన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు వైసీపీని గద్దెదింపడంతో ఓటమిని జీర్ణించుకోలేక మండల పరిషత్ కార్యాలయంలోకి వెళ్లి అధికార యంత్రాంగాన్ని భయపెడుతూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. వైసీపీ నాయకుల అరాచకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

డయేరియాతో మెరైన్ హోంగార్డు మృతి

వాకాడు, ఆగస్టు 6 : డయేరియాతో దుగరాజపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డు రాజేష్ (34) మంగళవారం మృతి చెందాడు. మెరైన్ స్టేషన్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు... తూపిలిపాళెం గ్రామానికి చెందిన రాజేష్ 2013 నుంచి దుగరాజపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. ఆదివారం తీవ్ర విరేచనాలు, వాంతులు కావడంతో కోట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకుంటున్నాడు. ఈక్రమంలో చికిత్సలు ఫలించక మంగళవారం మృతి చెందాడు. హోంగార్డు రాజేష్ మృతిపట్ల మెరైన్ ఎస్ఐ ఈశ్వరయ్య, సిబ్బంది సంతాపం తెలిపి నివాళులర్పించారు. రాజేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

తహసీల్దార్లు పారదర్శకంగా పనిచేయాలి

ఎమ్మెల్యే కురుగొండ్ల


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న తహసీల్దార్

డక్కిలి, ఆగస్టు 6: కొత్తగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్లు రెవెన్యూ సమస్యల పరిష్కారంలో పారదర్శకంగా పనిచేయాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సూచించారు. బుధవారం డక్కిలికి బదిలీపై వచ్చిన తహసీల్దార్ శ్రీనివాసులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కురుగొండ్ల మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వంలో తహసీల్దార్ల అండతో భూ ఆక్రమణలు, అడ్డగోలుగా పట్టాల మంజూరు జరిగాయన్నారు. పనుల కోసం కార్యాలయాలకు వచ్చే అర్జీదారులను రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా సకాలంలో పనులు చేసి పెట్టాలన్నారు. నియోజకవర్గంలో పేరుకుపోయిన రెవెన్యూ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు.

నేడు కురుగొండ్ల విజయోత్సవ సభ

డక్కిలి, ఆగస్టు 6: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్వగ్రామం పాతనాలపాడులో బుధవారం విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. రామకృష్ణ తమ గ్రామ నివాసి కావడం తామకు గర్వకారణమన్నారు. వెంకటగిరి నుంచి ఆయన మూడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించి చరిత్ర సృష్టించారని చెప్పారు.

పంట కాలువ పూడికతీత పనుల ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న విజయశ్రీ తదితరులు

నాయుడుపేట, ఆగస్టు 6: పట్టణ నడిబొడ్డున ప్రవహిస్తున్న విన్నమాల పంటకాలువ మురికి కూపంలా మారిందని, దాని పూడికతీతతో పరిసరాలు శుభ్రంగా మారుతాయని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. రూ.38 లక్షలతో నాయుడుపేట స్వర్ణముఖినది బీడీకాలనీ నుంచి ప్రారంభమయ్యే విన్నమాల పంటకాలువ పూడికతీత పనులను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపికతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ సహకారంతో పంటకాలువ పూడికతీత పనులను చేస్తున్నట్లు తెలిపారు. తద్వారా విన్నమాల, పెరికలంపాటికండ్రిగ, నరసారెడ్డికండ్రిగ ప్రాంతాల రైతులకు సాగునీరు అందుతుందన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ షేక్ రఫీ, నాయకులు పార్థసారథి, నెలవల రాజేష్, బీజేపీ నాయకులు కృష్ణయ్య, మాల్యాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించండి


న్యాయమూర్తికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గూడూరు, ఆగస్టు 6: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానాబేగం సూచించారు. మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో ఏరియా ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో న్యాయవాదులకు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనారోగ్యాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవడంతోపాటు వ్యాయామం తప్పనిసరి అన్నారు. న్యాయవాదులకు ఏరియా ఆసుపత్రి వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, డాక్టర్ మోహన, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

త్రివిధ దళాలలో ప్రవేశాలపై అవగాహన


సూచనలిస్తున్న కమాండర్ పరీక్షిత్

కోట, ఆగస్టు 6: మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం త్రివిధ దళాలలో ప్రవేశాలకు సంబంధించి అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సును కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి ప్రారంభించారు. తమిళనాడు రాష్ట్రం అరక్కోణం బేస్ క్యాంప్‌కు చెందిన ఇండియన్ నేవి అధికారి లెఫ్టినెంట్ కమాండర్ పరీక్షిత్‌రావు పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలోని ఎన్‌సీసీ క్యాడెట్లకు త్రివిధ దళాలలోని జీవన విధానాన్ని, ఇండియన్ నేవీ ప్రాముఖ్యతను, అవకాశాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, మాధవయ్య, శోభారాణి, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

షార్‌లో విద్యార్థులకు క్విజ్ పోటీలు


షార్ డైరెక్టర్ నుంచి బహుమతులు అందుకున్న విద్యార్థులు

సూళ్లూరుపేట, ఆగస్టు 6: జాతీయ అంతరిక్ష దినోత్సవాల్లో భాగంగా మంగళవారం షార్‌లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ నెల 23న అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఇస్రో, షార్ ఆధ్వర్యంలో దేశంలో వివిధ ప్రాంతాల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో భాగంగా రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహాలు వాటి ఉపయోగాలు తదితర అంశాలపై షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పరిసర ప్రాంతాల పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. సూళ్లూరుపేట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.హిమహంసిని, కె.సురంజన, ఎన్.యశశ్విని, ఇంటర్‌కు చెందిన అమృత లక్ష్మిలకు ప్రథమశ్రేణిలో నిలచి షార్ డైరెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.